POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
అక్టోబర్ 2023
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 06



పూజ్య భరద్వాజ గురుదేవుల జయంతి
(30-10-2023)

## ఈ నెల పండుగలు

అక్టోబరు *01* - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ జన్మదినోత్సవము
అక్టోబరు *09* - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ జన్మదినోత్సవము
(తిథి-భాద్రపద బహుళ దశమి)
అక్టోబరు *24* - విజయదశమి
అక్టోబరు *24* - శ్రీ శిరిడీ సాయినాథ్ మహారాజ్ మహాసమాధి
అక్టోబరు *30* - పూజ్య భరద్వాజ గురుదేవుల జయంతి



**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ జన్మదినోత్సవము**
**01-10-2023 ( ఆంగ్ల కాలమాన ప్రకారము )**
**09-10-2023 ( భాద్రపద బహుళ దశమి )**

# ఆయన ఎవరు ?

**శ్రీమతి అడిదం వేదవతి**

నెల్లూరు జిల్లా 'విద్యానగర్' అనే గ్రామంలో ఒక చిన్న ఇల్లు. ఆ ఇంటి సత్సంగహాలులో ఒక మధ్య తరగతి లెక్చరర్ గారు సాయి సేవలో నిమగ్నులై చాపమీద కూర్చుని వున్నారు. ఆయన ఎవరో కాదు – మన పూజ్యశ్రీ మాస్టరుగారే! ఇంతలో ఒక బస్సు వారింటి ముందు ఆగింది. అది శిరిడీ యాత్రకు నెల్లూరు నుంచి బయలు దేరిన బస్సు. అందులోంచి ఆత్రంగా, ఉత్సాహంగా ప్రయాణీకులైన సాయి భక్తులు వేగంగా దిగసాగారు. తమకు సాయినాథుని పరిచయం చేసి తమ జీవితాలలో వెలుగులు నింపిన ప్రేమమూర్తి అయిన మాస్టరుగారిని వెంటనే దర్శించాలనే ఉత్సాహంతో వేగంగా సత్సంగ హాలు వైపు పరుగులు తీశారు. వారు ఆయనను చూసేందుకు ఆత్రంగా ఒకరినొకరు త్రోసుకుంటూ పోటీ పడడంతో, హాలు బయట పడుకుని వున్న చిన్న కుక్కపిల్లపై ఒకరి కాలుపడి అది అక్కడి కక్కడే చనిపోయింది. తామెంతో ఉత్సాహంగా బయలుదేరిన శిరిడీ యాత్రలోని ఈ అపశృతి ఆ భక్తులనెంతగానో బాధించింది. వారంతా వెళ్ళి మాస్టరుగారితో వారి బాధను విన్నవించుకున్నారు.

అప్పుడొక అద్భుతం జరిగింది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ చనిపోయిన కుక్కపిల్లను తమ వద్దకు తెమ్మని దానిని ఒడిలో వుంచుకున్నారు. బాబాను ప్రార్థించి దానిపై ఊదీ చల్లి దానిని నిమురుతూ అందరితో మాట్లాడసాగారు. కొద్ది నిమిషాలలోనే అది లేచి హాయిగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది!!

ఈ అద్భుత లీలకు, ఆ సాధారణ వేషధారణ వెనుకవున్న ఆ అసాధారణ వ్యక్తి అయిన పూజ్యశ్రీ మాస్టరుగారి శక్తి సామర్థ్యాలకూ అందరూ ఆశ్చర్య చకితులయ్యారు.

మరణాన్ని సైతం శాసించగల ఆయన ఎవరు ?

బ్రహ్మలిఖితమైన కర్మసూత్రాన్ని సైతం శాసించగల భగవంతుడా? **జనన మరణాలను సైతం నియంత్రించ గల సర్వసమర్థుడా?**

అసలైన ఆధ్యాత్మిక జీవితపు శక్తి సామర్థ్యాలను ఋజువు చేసి, నకిలీ ఆధ్యాత్మికత, నాస్తిక హేతువాద భావాల పునాదులను కూకటివేళ్ళతో సహా పెకలించగల **సనాతన ధర్మవేత్తా**!?

అంతేకాదు.....

సమర్థ సద్గురువైన సాయినాథుని తన భక్తితో పరవశింప చేసిన **భక్తాగ్రేసరుడాయన!**

I.A.S. లాంటి ఉన్నత పదవులను తృణప్రాయంగా త్యజించి తమ జ్ఞానవర్షంతో ఎందరినో అన్వేషణకు పురికొలిపిన ఒక **దివ్యప్రబోధకుడు!**

ధర్మబద్ధమైన, నిర్దుష్టమైన ఆధ్యాత్మిక జీవితపు ఔన్నత్యాన్ని చాటిచెప్పి పాశ్చాత్య, ఆధునిక ప్రలోభాలతో, ప్రభావాలతో అల్లకల్లోలమైన శూన్య జీవితాల హీనమైన పరిస్థితిని తేటతెల్లం చేసి ప్రజలను రక్షించిన **ధర్మరక్షకుడు!**

ఆధ్యాత్మిక సూత్రాలను, ఆధునిక వైజ్ఞానిక సిద్ధాంతాలను సమన్వయపరచి భగవంతుని అస్తిత్వాన్ని, సృష్టి తత్వాన్ని, ప్రకృతి సూత్రాలను, కర్మ సిద్ధాంతాన్ని సహేతుకంగా నిరూపించిన **జ్ఞానతేజుడు!**

అతిక్లిష్టమైన ఆధ్యాత్మిక సత్యాలను అనుభవ పూర్వకంగా, సరళంగా, పామరులైన ప్రజలకు కూడా అర్థమయ్యేలా ఎరుకపరచిన **బోధనాదక్షుడు!**

మూఢాచారాలను, కులమత జాతిభేదాలను, సంకుచిత ధోరణులను త్యజించి జీవించిన **ధీరుడు**. వాటిని తమ నిర్దుష్టమైన ఆధ్యాత్మిక బోధతో, ఆచరణతో పారద్రోలిన **సంఘసంస్కర్త!**

**ఆయనే మన పూజ్య ఆచార్య**

**శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారు !!!**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 అక్టోబరు-2023 సంచిక:06

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | ఆయన ఎవరు? | శ్రీమతి అడిదం వేదవతి | 03 |
| 02. | మానవజాతి అనే మహావృక్షానికి పండిన ఆధ్యాత్మిక ఫలం శిరిడీ సాయిబాబా | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | పుట్టినరోజు కానుక | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | మా అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ! | శ్రీమతి రేపూరి అరుంధతి | 11 |
| 05. | మార్గ దర్శకులు | శ్రీమతి అడిదం వేదవతి | 15 |
| 06. | విశ్వమాత శ్రీ అలివేలుమంగమ్మకు జోహార్లు! | శ్రీమతి శ్రీదేవి | 17 |
| 07. | మధురమైన ఆత్మవంచనలో మునగరాదు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 08. | అమ్మా! శరణు శరణు! | శ్రీమతి అడిదం వేదవతి | 24 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి హైమవతి | 26 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి భాగ్య | 28 |


చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# మానవజాతి అనే మహావృక్షానికి పండిన ఆధ్యాత్మిక ఫలం శిరిడీ సాయిబాబా

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మన సమాజమంతా అంధకార బంధురంగా, మతకలహాలు, మతమార్పిడిలు వర్ణ సంబంధమైన అలజడులతో నిండియున్న ఈ సమయంలో విజయజ్యోతి మిణుకు మిణుకుమంటూ మనకు విజయదశమి రూపంలో ఆశాజ్యోతిని చూపుతోంది. కారణం అది మహాత్ములలోకెల్లా తలమానికమైన శ్రీ శిరిడీ సాయిబాబా మహాసమాధి చెందిన రోజు. ప్రతి సంవత్సరం భక్తులు ఆ రోజు ఆయన పుణ్యతిథి జరుపుకొని వారి హృదయాలలో ఆయన నాటిన నిజమైన మానవతా బీజాలను చక్కని స్మృతులనూ సంరక్షించుకునే రోజు.

మహారాష్ట్ర దేశంలో అహ్మదునగర్ జిల్లాలోని అతి కుగ్రామమైన శిరిడీ గ్రామ పొలిమేరలో సం॥1854 ప్రాంతంలో ఒక రోజున ఒక వేపచెట్టు క్రింద 16సం॥ల యువకునివలె కూర్చొని మొదట ప్రకటమైనారు శిరిడీ సాయిబాబా. వారి ఊరు, పేరు, కులము, మతము, తల్లిదండ్రులు మొదలైన వివరాలు ఎవరికీ తెలియదు. ఎందరడిగినా చెప్పక చిరునవ్వుతో దాటవేసేవారు. ఎప్పుడూ 'అల్లామాలిక్' (దైవమే ప్రభువు) అని స్మరిస్తూ, అయిదిళ్ళ దగ్గర భిక్ష చేస్తూ, శీతోష్ణాలను లెక్కచేయక అహోరాత్రులు ఆ చెట్టు మొదట్లో కనిపించేవారు. ఆర్తులు నమస్కరిస్తే 'అల్లా అచ్చా కరేగా' అని ఆశీర్వదించేవారు. ఇక అది రామబాణమై రక్షించేది. ఒకప్పుడు మౌనం వహించేవారు లేక 'అల్లా అనుమతించ లేదు' అనేవారు. ఒకసారి వర్షాలు తీవ్రంగా వున్నప్పుడు భక్తుల బలవంతంపై గ్రామములోని పాడుబడ్డ మశీదులో నివసించ నారంభించారు. దానికి 'ద్వారకామాయి' అని పేరుబెట్టారు. అందు తూర్పువైపున నిరతాగ్నిని, మసీదు ఎదుట తులసిని ప్రతిష్ఠించి తాము ఉత్తరంగా కూర్చొనేవారు. సుమారు 60 సం॥లు తమ అవతార కార్యాన్ని కొనసాగించారు.

సాంప్రదాయకులైన ముస్లిములొచ్చినపుడు అరబ్బీలో ఖురాన్ నుండి వాక్యాలు చెప్పి వారి సాంప్రదాయం ప్రకారం ఆత్మపథంలో నడిపించేవారు. రంజాన్, మొహరమ్ వంటి వేడుకలు జరుపుకోమని ప్రోత్సహించేవారు. వీరు



నివేదన తెచ్చినపుడు 'ఫాతిహా' చదివేవారు. స్థానికమైన ముస్లిముల విశ్రాంతి గృహమైన తాకియాకు వెళ్ళి రాత్రులందు ఫకీర్లతో కలిసి గజ్జకట్టి నృత్యం చేస్తూ అరబ్బీ, పార్సీ భాషలలోని భక్తిగీతాలనే కాక కబీరు వంటి మహనీయుల తత్త్వాలను కూడా పాడేవారు. తాము పేదఫకీరనీ అల్లా యొక్క బానిసను మాత్రమేనని చెప్పేవారు. అబ్దుల్లా, బడేబాబా, అబ్బాసేట్, ఇమాంభాయి మొ॥న సాధువులను ఇస్లాం సాంప్రదాయానుసారం కృతార్థులను

చేశారు. హజరత్ తాజుద్దీన్ బాబా, దర్వేష్ షా, బన్నేమియా, షంషుద్దీన్ వంటి ముస్లిం సిద్ధపురుషులు శ్రీ సాయిని గొప్ప ఔలియాగా తలచి తమ శిష్యులను వారి దర్శనానికి పంపేవారు.

పై కారణాలుగా ఆయన ముస్లిం అనుకొందామా అంటే హిందువులచేత రామనవమి, గురుపూర్ణిమ (వ్యాస పూర్ణిమ), దత్తజయంతి జరిపించడమే కాక, వారిచేత వేదాంత పంచదశి, భగవద్గీత, భాగవతము వంటి గ్రంథాలను చదివించేవారు. రాముడు, మారుతి, దత్తాత్రేయులవారు, గణపతి, విఠలుడు మొ॥న దేవతల రూపంలో ఆయా భక్తులకు దర్శనమిచ్చి తామే సకల దేవతలు అని నిరూపించారు. నైష్ఠిక బ్రహ్మచారిగా అగ్నిని సేవిస్తూ, పంచభిక్షతో జీవించారు. భాష్యత్రయంలో భగవద్గీతను కాచి వడబోసిన పండితుని విద్యాగర్వభంగం చేసి కీలకమైన ఒక శ్లోకానికి వినూత్నమైన వ్యాఖ్యనిచ్చారు.

నాడు, పూర్వము కూడ హిందూ ముస్లిం సాంప్రదాయాలలో వెలసిన మహనీయులందరూ తన రూపమేనని దర్శనపూర్వకంగా నిరూపించారు. ఏ జీవిని హింసించినా, ఆదరించినా కూడా అది తమకే చెందుతుందని నిదర్శనమిచ్చారు. ఆరాధ్యములైన 'నిర్జీవ' ప్రతిమలు కూడ తమ రూపమేనని నిరూపించారు. సర్వకాల సర్వావస్థల యందు తన భక్తుల బాహ్యాంతరాలలో ఎక్కడ ఏమి జరుగుతున్నా అది ఆయనకు తెలిసేది. అందుకే హిందూ మహనీయులు ఆయనను సంపూర్ణ దత్తాత్రేయ అవతారంగా, మహనీయులనే మణులలో కెల్లా కోహినూర్ వంటివాడని స్తుతించారు. ఎందరో క్రైస్తవ, పార్శీ, హిందూ, జైన మతస్థులకు కూడ దివ్యానుభవాలను ప్రసాదించి ఉద్ధరించారు. అక్బర్ వంటి చక్రవర్తులు, కబీరువంటి మహనీయులు ఎటువంటి సర్వమత సామరస్యం కోసం కష్టించారో, అట్టి కృషి ఫలితంగా మానవజాతి అనే మహావృక్షానికి పండిన ఆధ్యాత్మఫలమా శ్రీసాయి అనిపిస్తుంది. ఆత్మ సర్వగతమనీ కనుక జీవకారుణ్యము, మత సామరస్యమూ మన ధర్మాలని వాచా కాక అనుభవ పూర్వకంగా నిరూపించిన దివ్యపురుషుడు సాయిబాబా.

భకులు ఆయన్నెంతగా కొలిచినా ఆయన పేద ఫకీరుగానే వ్యవహరించారు. 60 సం॥లలో ఒక్కసారి కూడ భక్తులు తమను ఊరేగించడానికి ఆయన సమ్మతించలేదు. నిత్యమూ భక్తులనుండి సమకూడిన 4, 5 వందల రూపాయలను సూర్యాస్తమయ మయ్యేసరికి పేదలకు పంచియిచ్చి పంచభిక్ష నాశ్రయించిన పరమ వైరాగ్యమూర్తి. కోటీశ్వరులూ, నిరుపేదలూ, నోరులేని జీవులు – వీటన్నిటికీ ఆయన దర్బారులో ఒకే స్థానముండేది. భక్తులకూ, వారికీ మధ్య ఎటువంటి మధ్యవర్తులూ వుండేవారు కాదు. క్షుద్రమైన శక్తి ప్రదర్శనను ఆయన నిరసించారు. పైన చెప్పిన ధర్మాలను బోధించే దివ్యలీలలు ఆయన సంకల్పించకనే సంభవించేవి. కేవలం భక్తుల నాశ్చర్యపరచి తమ ఆధిక్యం చాటుకొనే లీలలను ఆయన వేశ్యతో ముద్దులాటగా పరిగణించారు.

ఇలా 60 సం॥లు శిరిడీ యందే నివసించి అక్టోబర్ 1918 విజయదశమి నాడు మధ్యాహ్నం 2–30 గంటలకు సాయి శరీరాన్ని త్యజించారు. అయినప్పటికీ వారి వాగ్దానం ప్రకారం ఎందరికో నేటికీ తమ స్థూలదేహంతో గానీ, స్వప్నంలో గానీ దర్శనమిస్తూ భక్తులను రక్షిస్తున్నారు. వారి ప్రత్యక్షసన్నిధిలో నాడెలా సర్వమతస్థులూ కలిసి అన్ని మతాల వేడుకలు జరుపుకున్నారో, అలానే నేడు కూడ జరుగుతున్నాయి. ఇటువంటి మహనీయుని చరిత్ర, బోధలను పరిశీలించడం నేటి సమాజానికెంతో ఆవశ్యకం. కులమత కలహాలు, వికృతమైన వర్ణవ్యవస్థ వంటివి, ప్రజల హృదయాల నుండి తొలగించబడడానికి ఇది చక్కటి సాధనము. మన ధర్మశాస్త్రాలు 'ధర్మసందేహం కలిగినప్పుడు ఆత్మవేత్తల ఆచరణలను ధృవతారగా తీసుకోవలసివస్తుందని, అట్టి గురువుల వాక్యాలకు, శాస్త్రానికీ, వైరుధ్యమేర్పడినప్పుడు శాస్త్రాన్ని విడచి మహనీయుల ఆచరణ, బోధనలకే ప్రాధాన్యమివ్వాలని' చెబుతాయి. ఈ ధర్మాన్ననుసరించి ఛాందసులు నడుచుకున్నట్లయితే, ఈనాడు మన సమాజ మెదుర్కొంటున్న సమస్యలెన్నో ఉత్పన్నమయ్యేవే కావు. ఈ సత్యాన్ని విస్మరించినా, కాలం దైవస్వరూపం కనుక నేటి ఆచార్యులనూ, పీఠాధిపతులనూ తమ వైఖరిని మార్చుకొని నిజమైన ధర్మాన్ని గుర్తించేలా చేస్తున్నాయి. మహాకవి కలీల్ జీబ్రాన్ చెప్పిన "ఈనాడు నా ఒక్కని హృదయం పల్కిన పల్కులను రేపు వేయి హృదయాలు పల్కి తీరుతాయి" అన్న వాక్యం రూపంలో సాయిబాబా చాటిన ధర్మం కాలమనే పర్వత సానువులలో అన్ని వైపులనించీ దిక్కులు మారుమోగేలాగ ప్రతిధ్వనిస్తోంది. ●

(అక్టోబరు 2016 సాయిబాబా మాసపత్రిక నుండి)

# పుట్టినరోజు కానుక

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

పరమపూజ్య శ్రీభరద్వాజ మాస్టరుగారి జన్మదినం వస్తున్నది. ఆయన జన్మదినం మనకు ఎంతో ప్రియమైనది, ప్రత్యేకమైనది, పవిత్రమైనది. కారణం ఆయనే మనకు తల్లి, తండ్రి, దైవము, గురువూ కూడా. ఆయనను మించిన అండ మనకు ఎవరూ లేరు. అందుకనే ఆయన గురించి చింతన చేస్తున్నప్పుడు హృదయం ఉప్పొంగుతుంది. ఆయన లీలా శ్రవణంలో లీనమైపోయి, మనలను మనమే మర్చిపోతాము. అలాంటి సమయంలో మనం ఆయనకు సర్వమూ సమర్పించుకుందామని అనుకుంటాము. 'నాకు సర్వమూ మీరే!' అని మనసారా అనుకుంటాము. ఆయనే అన్నీ చేస్తున్నారనీ, చేయిస్తున్నారనీ, ప్రతి సంఘటన ఆయన జరిపించేదేనని, అట్టి సమయంలో అనిపిస్తుంది కూడా. కానీ, ఆ భావం ఎంతోసేపు నిలువదు. అనుక్షణం నిత్యజీవితంలో జరిగే సంఘటనలలో ఈ విషయం మరచిపోతాము. అంటే ఆ విషయం మరచిపోయి మనం చేస్తున్నట్లుగాను, లేక ఇతరులు చేస్తున్నట్లుగాను భావించడం జరుగుతుంది. అంటే మనకు సర్వసమర్పణ చేసుకోవడం సాధ్యపడదన్నమాట! అందుకని దానికోసం ప్రయత్నిస్తూ వుండటమే మనం చేయవలసిన పని.

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదినం సందర్భంగా ఏమి చేయాలి? ఏమి చేద్దాము అని ఒకసారి ఆలోచించుకుందాము.

సాధారణంగా ఈ సందర్భంగా మనకు అనిపించేది పూజ్యశ్రీ మాస్టరుగారికి భిక్ష, వస్త్రాలు, దక్షిణ – ఈ మూడూ గాని, ఈ మూడింటిలో ఏదైనా గాని సమర్పించుకోగలిగితే మనకెంతో తృప్తి లభిస్తుంది. వాటిని మనము సమర్పించుకున్నప్పుడు గురువునకు కొంతవరకూ సంతోషం అనిపించవచ్చు. కానీ ఆయన మన నుంచి కోరేది అదేనా? గురువు వైపునుంచి ఆలోచిస్తే ఆయన మాటలలోను, చర్యలలోనూ స్ఫురించేది వేరుగా అనిపిస్తుంది. ఆయన మననుంచి ఆశించేది మాత్రం తను, మన, ధనాలనే. తను, మన, ధనాలంటే ఏమిటి? మన తనువును అంటే శరీరాన్ని, మన మనస్సును, మనకున్న సంపదనూ ఆయనకు అర్పించడమన్నమాట.

తనువును అర్పించడమంటే మన శరీరంతో ఆయనకు సేవ చేయడమన్నమాట. గురువు యొక్క సన్నిధిలో వున్నప్పుడు కొంతవరకూ ఇది సాధ్యపడవచ్చునేమోగాని, నిరంతరం ఆయనకు సేవ చేస్తూవుండే అవకాశం అందరికీ ఎల్లవేళలా లభించకపోవచ్చు. అసలు గురువు దగ్గర వుండటానికి అవకాశమే లేనప్పుడు అది ఎలా సాధ్యపడుతుంది? అన్నది ప్రశ్న.

నిజమే! గురువు యొక్క సన్నిధిలో వున్నప్పుడు కూడా గురువుకు ప్రత్యేకమైన సేవ చేయడం కొంతవరకూ కొందరికి లభించవచ్చు, లభించకపోవచ్చు. ఇక్కడ మనము ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అసలు గురువు యొక్క సన్నిధిలో ఉండటమే ఎన్నో జన్మల పుణ్యఫలం. అంతటి అదృష్టం కలగడానికి వాళ్ళ అనుగ్రహమే కారణమని గుర్తుంచుకోవాలి. ఆ గుర్తును నిరంతరం నిలుపుకుంటూ ఆ సన్నిధిలోని ఏ ఇతర పనులనైనా సరే గురుసేవగా భావించుకోవాలి. అక్కడ సేవ చేసుకోవడమే అదృష్టము అన్న



భావన వుండాలి. అక్కడ ఎప్పుడు ఎటువంటి సేవ దొరికినా సరే, వచ్చిన సేవను చక్కగా చేసుకోవాలి. ఇక గురువుకు దూరంగా వున్నవారు, గురుసన్నిధికి వచ్చినా అట్టి అవకాశం లేనివారు ఏమి చెయ్యాలి? అంటే అసలు గురువంటే శరీరం మాత్రమే కాదు – సర్వత్రా నిండి వున్నారని, కనుక మన ఇంట్లో పటం రూపంలో కూడా వున్నారని మనం గుర్తుంచుకోవాలి. ఆ గుర్తును నిలుపుకోడానికి ప్రయత్నిస్తూ, ఇంట్లోనూ, బయట చేసే పనులు ఆయన సేవగా భావించాలి. అప్పుడు గురుసేవ చేసుకున్నట్లే అవుతుంది.

ఇక మనస్సును గురువునకు అర్పించడమంటే ఏమిటి? మన మనస్సులో వచ్చే ఆలోచనలను అయన పరంగా మలచుకోవడం. అంటే ఏ పని చేస్తున్నా అది అయన సేవగా భావించడం అలవరచుకోవాలి. ఇతర ఆలోచనలు వచ్చినప్పుడల్లా వాటిని తొలగించుకుంటూ గురువు యొక్క లీలలను స్మరించుకుంటూ నామస్మరణం చేసుకుంటూ సమయం గడపడం అలవాటు చేసుకోవాలి. కొన్ని పనులు, వ్యవహారాలు చేస్తున్నప్పుడు అలా గడపడానికి వీలుపడకపోవచ్చు. అప్పుడు ఆ పనిగాని, వ్యవహారంగాని పూర్తి అయిన తరువాత ఆయనను స్మరించుకోవాలి. మనకు ఏది లభించినా ప్రతిదీ ఆయన ప్రసాదించినదేనని గుర్తు పెట్టుకోవడానికి ప్రయత్నించాలి. అంతే కాదు, ప్రతీదీ అంటే మనం పీల్చేగాలి, నీరు, అగ్ని, నిలబడేందుకు ఆధారమైన భూమి, ఆకాశమూ మాత్రమే గాక నివసించడానికి ఇల్లు (అంటే స్వంత ఇల్లు మాత్రమే కాదు; ఎటువంటి ఆచ్ఛాదనైనా సరే), భుజించడానికి ఆహారము, ధరించడానికి వస్త్రాలు, వీటిని అనుభవించడానికి శరీరము – ఇవన్నీ ఆయన ప్రసాదించినవేనని గుర్తుపెట్టుకోవాలి. అంతేకాదు, మనము జన్మించడానికి కారణభూతులైన తల్లిదండ్రులేగాక, బంధుమిత్రులు, సమాజంలో మనం యిలా జీవించడానికి సహకరిస్తున్న సాటి మానవులు ఆయన ప్రసాదించినవారేనని, మనకు ప్రాణాధారములైన చెట్లు, ఇతర జీవులు ఆయన ప్రసాదించినవేనని గుర్తుంచుకోవాలి. మనస్సు ఇతర ఆలోచనలమీదకు వెళుతున్నప్పుడల్లా తిరిగి తిరిగి ఆయన స్మరణతో ఇటువంటి ఆలోచనల మీదకు మళ్ళించుకోవాలి.

ఇక ధనం విషయానికి వస్తే మనకున్న ధనాన్ని మన శక్తిమేరకు మన గురువుకు సమర్పించుకోవాలి.

సద్గురువు కోరుకునేది మనము ఇప్పుడు చెప్పుకున్న

తను, మన, ధనాలను మాత్రమేకాక, భక్తి, ప్రేమ, కృతజ్ఞతలను కూడా. ఏవీ సమర్పించుకోలేక పోయినప్పటికీ భక్తి, ప్రేమ, కృతజ్ఞతలుంటే చాలు - ఆయనను సంతృప్తి పరచడానికి. ఇందుకు ఉదాహరణలుగా కొన్ని సంఘటలను ఇక్కడ చెప్పుకోవడం అవసరం.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒంగోలులో సంతపేటలో వున్నప్పుడు ఆయన వద్దకు ఒక అవ్వగారు వస్తూండేది. ఆమెకు పూజ్యశ్రీ మాస్టరుగారంటే ఎంతో భక్తి. ఒకసారి ఆయన ఆమెకు శ్రీరామునిగా దర్శనం యిచ్చారు కూడా. ఆమె నిరుపేదరాలు. పూజ్యశ్రీ మాస్టరుగారికి పూవులైనా సమర్పించుకోలేని పరిస్థితి ఆమెది. కానీ ఆమె ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఒక్కసారైనా వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకునేది. 80 సం॥లు పైబడిన ఆమె వంగి వంగి నడుస్తూ అతి కష్టంతో పూజ్యశ్రీ మాస్టరుగారి వద్దకు వస్తుంటే అందరికీ ఆశ్చర్యం వేసేది. ఆయన ఆమె రాగానే ఎంతో ఆదరంతో పలకరించేవారు. ఆమె ఆయన పాదాలకు నమస్కరించి పాదసేవ చేసుకోవడానికి పాదాలు ఇవ్వమని ప్రార్థించేది. పూజ్యశ్రీ మాస్టరుగారు కృపతో ఆమెకు ఆ సేవను ప్రసాదించేవారు. దాదాపుగా ఎవ్వరికీ లభించని ఆ అవకాశం ఆమెకు తరచుగా లభించడం ఆమె అదృష్టం. ఆమె లౌకికమైన వస్తువులేవీ ఆయనకు ఎన్నడూ సమర్పించుకోలేదు. కానీ ఆమెకు పూజ్యశ్రీ మాస్టరుగారిపై వున్న భక్తికి ఆయన ప్రసన్నులై ఆమెను అలా అనుగ్రహించారు.

మాస్టరుగారు ఒంగోలులోని లాయరుపేటలో వున్నప్పుడు అయన వద్దకు చుట్టుప్రక్కల గుడిసెలలో వున్న పిల్లలు చాలామంది. అక్కడ జరిగే ఆరతులకు వచ్చేవారు. అంతేగాక రోజులో మధ్య మధ్యలో వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుని ఆయన యిచ్చే ప్రసాదాలు తీసుకొని వెళుతూ వుండేవారు. ఆ పిల్లలకు పూజ్యశ్రీ మాస్టరుగారంటే ఎంతో ఇష్టం. ఆయన పుట్టినరోజు వచ్చిందంటే చాలు. వాళ్ళు ఎంతో ఉత్సాహంతో ముందురోజు తెల్లవార్లూ ఆయన కూర్చునే సత్సంగహాలును రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక పుట్టినరోజున వారంతా వినాయకచవితికి వినాయకుని విగ్రహాలను, పూజా వస్తువులనూ అమ్మి, వాటి ద్వారా వచ్చిన పైకంతో పూజ్యశ్రీ మాస్టరుగారికి ఒక చొక్కా, ఒక టవలు కొని సమర్పించుకున్నారు. పుట్టినరోజున ఆయన కూర్చున్న స్టేజి మీదకు వచ్చి ఆ పిల్లలు వాటిని సమర్పించుకోగానే పూజ్యశ్రీ మాస్టరుగారు అత్యంత వాత్సల్యంతో ఆ వస్త్రాలను అందుకుని అప్పటికప్పుడే అక్కడికక్కడే ఆయన వేసుకున్న చొక్కాను తీసివేసి ఆ పిల్లలు ప్రేమతో యిచ్చిన చొక్కాను ధరించారు. వారిపై పూజ్యశ్రీ మాస్టరుగారి వాత్సల్యానికి అవధులు లేనట్లే, అలా తాము ఇచ్చిన చొక్కాను ఆయన ధరించడంతో ఆ పిల్లల ఆనందానికి కూడా అవధులు లేవు!

ఇలాంటిదే మరొక్క ఉదాహరణ : ఒకసారి ఒకతను పూజ్యశ్రీ మాస్టరుగారి వద్దకు వచ్చాడు. అతడు అప్పుడప్పుడూ ఆయన వద్దకు వస్తూ వుండేవాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు అతనిని చూస్తూనే, “రా, కూర్చో! బాగున్నావా?” అని అడిగారు. అతను నిరుపేద. అతడు పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరించి యిలా అన్నాడు. “స్వామీ! నేను పేదవాడిని నా దగ్గర ఏమాత్రం డబ్బుల్లేవు. మీరు నాకెంతో మేలు చేశారు. ఎన్నో ఆపదల నుంచి రక్షించారు. అందుకు కృతజ్ఞతగానైనా నేను ఏమీ సమర్పించుకోలేకపోతున్నాను. అందుకని మా దొడ్లో వున్న సీమచింతకాయ చెట్టు కాయలను మాత్రం ఏరుకొని తెచ్చాను. వాటిని మీరు స్వీకరించగలరా? అవి మీకు పనికివస్తాయో లేదోనని అనుమానంగా ఉంది”. అతడు ఆ మాటలు పూర్తి చేశాడో లేదో వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు. “అరెరే! అదేంటోయ్ అలా అంటున్నావు? నేను స్వీకరించకపోవడమేమిటి? ఇలాతే!” అంటూ అతని వద్దనున్న ఆ కాయలను తీసుకుని వెంటనే వాటిలో ఎర్రగా పండిన గింజలను తీసుకొని నోట్లో వేసుకున్నారు. అది చూసిన అతని ఆశ్చర్యానికి అవధులు లేవు. అంతులేని ఆనందంతో అతనికి దుఃఖం పొర్లుకొచ్చింది. వెంటనే అతడు. “స్వామీ! నన్నింతగా కరుణించారా!” అంటూ ఆయన పాదాలు పట్టుకుని ఎంతగానో దుఃఖించాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు అతనిని లేవదీసి యిలా అన్నారు, “నాకేమీ సమర్పించుకోలేదని నీవెప్పుడూ అనుకోవద్దు. ఏమీ సమర్పించుకోకపోయినా ఏదైనా సమర్పించుకోవాలనే నీ కోరిక, నీ ఆరాటమూ చాలు నాకు. అప్పుడు నాకు సమర్పించినట్లే. నీవేదైనా సమర్పించుకోవాలన్నప్పుడు హృదయపూర్వకంగా మనస్సులోనే సమర్పించుకో. అప్పుడు కూడ నేను తప్పక స్వీకరిస్తాను” అన్నారు. ఆయన మాటలు వినిన మేము ఎంతో ఆశ్చర్యపోయాము. ఆయన ఎప్పుడూ కూడా అలా బయటపడి ఎవరికీ హామీ యివ్వడం చూడలేదు. మనం చూడకపోయినా ఎన్ని సన్నివేశాలలో ఎందరిని అలా

కరుణించి ఆయన అనుగ్రహించారో ఎవరు చెప్పగలరు?


పై సంఘటనను బట్టి మననుంచి ఆయన ఆశించేది ఏమిటో మనకు అవగతమౌతుంది.

నిశితంగా గమనిస్తే పైన చెప్పుకున్నటువంటి తను, మన, ధనాలను గాని, భిక్ష, వస్త్రములు, దక్షిణలను గానీ సమర్పించుకోవాలంటే కూడా భక్తి, ప్రేమ, కృతజ్ఞతలలో ఏ ఒక్కటైనా లేనిదే సమర్పించుకోలేము. అందుకని భక్తి, ప్రేమ, కృతజ్ఞతలనేవి గురువుకు సమర్పించుకోవడానికి అతి ప్రధానమైన అంశాలన్నమాట.

అంతేకాదు, ఈ భక్తి, ప్రేమ, కృతజ్ఞతలు కూడా సరియైన విధంగా వుండాలి. అవి సరియైన విధంగా వుండాలంటే మనలో రాగ, ద్వేష, అహంకారాది భావాలు తొలగిపోవాలి. నాకు ఎంతో భక్తి వున్నదనిగాని, కృతజ్ఞత వున్నదనిగాని, ప్రేమ వున్నదనిగాని అనిపిస్తే, మనలో అహంకారం తలెత్తినట్లే. అంటే 'నేనుగొప్ప' అన్న భావనతో కూడిన భక్తి, ప్రేమ, కృతజ్ఞతలు కూడా పతనానికి దారితీస్తాయి. నిజానికి ఆయనకు ఏమీ అవసరం లేదు. ఏ కోరికా లేని ఆయనకు ఏమి కావాలి? అందరికీ అన్నింటినీ ప్రసాదించేవారు ఆయనే అయినప్పుడు ఆయనకు మనం సమర్పించడానికి ఏమి వుంటుంది గనుక? కారణం అయనకు ఏదైనా సమర్పించామంటే తిరిగి అయన మనకు ఎన్నోరెట్లు ప్రసాదిస్తారు. ఇది సద్గురు శ్రీ సాయిబాబా కూడా స్పష్టంగా చెప్పారు. అందుకని సర్వమూ ప్రసాదించేది ఆయనేనని గుర్తుపెట్టుకుని ఏదైనా సరే ఆయనకు సమర్పించుకోవడం మన ధర్మం, కర్తవ్యం కూడా. గృహ యజమాని సంపాదించిన డబ్బుతో మనం భుజిస్తూ ఆయనకు పెట్టకుండా తినడం ఎంత వరకూ సమంజసం? అలాగే అన్నీను. అందుకని మన గురుదేవులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి మన శక్తి మేరకు ఏదైనా సమర్పించుకోవచ్చు. ఏమీ సమర్పించుకోలేకపోతే మానసికంగా అయినా సమర్పించుకోవచ్చు.

అందుకని సరియైన భక్తి, ప్రేమ, కృతజ్ఞతలతో, మన శరీరంతో ఆయన సేవ చేసుకుంటూ, ఆయనను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా ఆయనకు ఏదైనా సమర్పించుకుంటూ సమయాన్ని గడపడమే మనం చేయవలసినది.

# ఆచార్య సందేశం



సాయి మనకు ప్రసాదించాలని ఆరాటపడిన ఉన్నతిని మరింత త్వరగా భక్తులు పొంది ఆయనను, తమనూ సంతుష్టి పరచగలగాలని నా ఆశ! అట్టి మహనీయమూర్తిని సంతుష్టి పరచడంకన్నా మనం చేయదగినదేమున్నది? ఆయన సంతుష్టులైతే సకల సృష్టి సంతుష్టమైనట్లే. సకల జీవులకూ శ్రేయస్కరమైన రీతిన మన జీవితాలను సంస్కరించుకోవడమే కదా సాయి బోధించిన మార్గము. అలా ఆచరించడం ఆయనను సంతృప్తి పరచగల మార్గము.

సకల విశ్వరూపుడైన సాయియే సత్యము!
సకల జన శ్రేయస్కరమైన సాయి బోధయే మార్గము!
సాయి లక్ష్యంగా, వారి బోధనను మార్గంగా స్వీకరించిన వారిచేత సాధింపబడే
పరమ శ్రేయస్సే శాశ్వత జీవనము!!

# మా అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ!

*శ్రీమతి రేవూరి అరుంధతి*

'అమ్మ' అనే పదం గుర్తు రాగానే, మనకు బాగా కనిపించే విషయం, ప్రేమ లేక ఆప్యాయత. నాకు పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి లో, ముగ్గురు మూర్తులు కనిపిస్తారు. ఒక గురువుగా, పెంచి పోషించే తల్లిగా, ఎప్పుడూ కాపాడే దేవిగా.. నేను ఆ మూడు మూర్తుల అనుగ్రహాన్ని మన "అమ్మగారి" దగ్గర పొందాను.

నేను మొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించినది 1979-80 ప్రాంతంలో! పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు, వేదమ్మ ఢిల్లీకి వచ్చి, శ్రీమతి ఉమా అయ్యర్ గారింట్లో బస చేసారు. నాకు అప్పుడు సుమారు 7 లేక 8 సంవత్సరములు వయస్సు వుంటుంది. ఉమా అయ్యర్ గారి పిల్లలతో ఆడుకుంటూ, పూజ్యశ్రీ అమ్మగారున్న గదిలోకి వెళ్ళాం. అప్పుడే నేను మొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని చూడటం. ఆ తరువాత శిరిడీలో ఒకసారి, తరువాత ఒంగోలుకి వేసవి సెలవలకి వెళ్ళినప్పుడు, పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టిన రోజు వేడుకలకు వెళ్ళినప్పుడు - యిలా క్రమంగా పూజ్యశ్రీ అమ్మగారితో కొద్ది కొద్దిగా సన్నిహితం పెరిగింది.

నా చిన్నతనం నుంచి ఢిల్లీ లో పెరగడం వలన, నా ఆలోచనలు ఎక్కడో ఆకాశంలో వుండేవి. పూజ్య అమ్మగారి దయవల్ల, వారి బోధ వల్ల, మెల్లమెల్లగా, సరిగా నేలమీద నడిచేలా నాలో మార్పు వచ్చింది. (ఆకాశంలో కష్టాలు కనిపించవు. నేల మీద వుండే దారి అయితే కొన్నిసార్లు మెత్తగా వుంటే, కొన్నిసార్లు ముళ్ళతో వుంటుంది! మనలో చాలామంది ఇలా జీవితాన్ని సత్యదూరంగానే చూస్తాము లేదా ఊహించుకుంటాము.)

నేను ముందు చెప్పినట్టు, ఢిల్లీలో పెరగడంవలన సంప్రదాయాలు, ఆచారాలు గురించి సరియైన అవగాహన లేకుండా పెరిగాను, నా తలిదండ్రులు వాటిని పాటిస్తున్నా! 1988-1998 మధ్యలో అప్పుడప్పుడు ఢిల్లీ నుంచి వచ్చి ఒంగోలులో పూజ్య అమ్మగారి చెంత వుండే అవకాశం మాకు లభించడం వలన ఈ సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పట్ల నాకు సరైన అవగాహన కలిగింది. ఇది పూజ్య అమ్మగారు నా జీవితంలో నాకు ప్రసాదించిన భాగ్యం! మాకు అందుకే, యిప్పుడు గురుకుటుంబం కంటే ఆప్తులు లేక బంధువులు ఎవ్వరూ లేరు. అది పూజ్య మాస్టరుగారు, పూజ్య అమ్మగారు మాపై వర్షించిన అవ్యాజమైన ఆప్యాయత, కరుణ! ఇంతటి అదృష్టం మా తల్లిదండ్రుల ద్వారా నాకు లభించింది. అందుకని వారికి కూడా ఈ సందర్భంగా నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

వేసవి సెలవలకి మేము ఒంగోలు వెళ్ళినపుడు పూజ్యశ్రీ అమ్మగారే స్వయంగా మాకు తెలుగుభాష, వంటలు, ముగ్గులు, అందరితో కలిసిమెలసి వుండటం ఇలా ఎన్నో విషయాలు నేర్పించేవారు. అదొక మరచిపోలేని మధురానుభూతి!

ఒంగోలు వచ్చిన ప్రతిసారి, పూజ్య అమ్మగారు ఒక ప్రశ్న వేసేవారు - "ఎలా గడుపుకుందాము అనుకుంటున్నారు సమయాన్ని?" ఇది ఎప్పుడూ ఒక చిక్కు ప్రశ్నయే మాకు. ఒంగోలుకు రావడం అంటే, అన్నింటినీ ఢిల్లీలో వదిలేసి,

అత్యంత ఆప్తుల దగ్గరికి వెళుతున్నాము, ఒక సంతోషాన్నిచ్చే ప్రదేశానికి వెళుతున్నాము అనే ఆలోచన మాత్రమే వుండేది. మా మనస్సులు ఒక తెలియని ఆనందంలో ఉరకలు వేస్తుండేవి!! కానీ అక్కడ ఏమి చెయ్యాలి, ఎలా వుండాలి అనే ఆలోచన వుండేది కాదు. కానీ, మాతృమూర్తి, గురువు అయిన పూజ్య అమ్మగారికి తెలియకపోతే కదా మాకు ఏమి నేర్పించాలో, మమ్మల్ని ఎలా దిద్దాలో! మాకు ఆచార సాంప్రదాయాల్ని ఎంత వీలైతే అంతగా నేర్పించే ప్రయత్నం చేశారు. తెలుగు భాష నేర్పించే ప్రయత్నం చేశారు. అప్పుడే కదా పూజ్య మాస్టరుగారి గ్రంథాలు సరిగ్గా అర్థం చేసుకోగలం. మేము పూజ్య అమ్మగారి దగ్గర కొన్ని సినిమాలు కూడా చూసేవాళ్ళం. వాటి వల్ల కూడా, ఓహో ఇదా ఆచారం అంటే, సాంప్రదాయం అంటే, జీవితపు విలువలు అంటే అని తెలిసేది.

ఒకసారి పూజ్య అమ్మగారు నాకు తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు ప్రసాదించారు.. పూజ్య మాస్టరు గారి వ్యాసాలు కూడా యిచ్చి, వాటిని అనువదించమని చెప్పారు. ఇది నాకు కలిగిన గొప్ప అదృష్టం. ఎందుకంటే, త్వరితగతిన తెలుగు భాష తగినంతగా నేర్చుకోవడానికి ఉపయోగపడింది. చాలాసార్లు వేదమ్మగారి నృత్య సాధన పూజ్య అమ్మగారి ముందు జరిగేది, చిన్ని కృష్ణుడు లేక దుర్గామాతగా. అది, కళను ఆధ్యాత్మికంగా మనస్సును సరైన మార్గంలో పెట్టుకోవడానికి సాధనగా ఎలా వాడారో, నాకు యిప్పుడు తెలుస్తుంది.

ఎప్పుడూ, నిలయంలో 20 మందికి తక్కువ కాకుండా వుండేవారం. చాలాసార్లు, అందరికీ మేము పూజ్య అమ్మగారి ముందే విస్తళ్ళు వేసి వడ్డన చేసేవారం. అప్పుడు జరిగే ఆహ్లాదకరమైన సంభాషణలు కానీ, వంటకాల రుచి అయితేనేమి, ఇవన్నీ ఒక పక్క అయితే, ప్రతి ఒక్కరి మీద పూజ్య అమ్మగారి నిశితమైన దృష్టి, వారికి ఏమి కావాలో, వారు సంతృప్తికరంగా భోజనం చేస్తున్నారో లేదోనని పూజ్య అమ్మగారు గమనించడం నన్నెంతో ప్రభావితం చేసేవి. అలా శ్రద్ధతో భోజనం పెట్టడం అనేది నేను అక్కడే నేర్చుకున్నాను. దానికి తోడు, ఆకులో ఎలా వడ్డించాలి, ఏది ముందు ఏది తరువాత వడ్డించాలో, స్వయంగా పూజ్య అమ్మగారు నేర్పించారు. ఒక్కోసారి, నివేదనకు చదివే శ్లోకం వివరణ ఇవ్వడం, పూర్వం ఎలా వండేవారో లేక ఎలా వడ్డించేవారో, ఇవి అన్నీ పూజ్య అమ్మగారు చెపుతూ వుండేవారు. ఆకలి తీర్చి




సంతృప్తి పరచడం గృహస్థు యొక్క ముఖ్యధర్మం అని చెపుతూ వుండేవారు. వీటన్నిటి వెనుక, పూజ్య మాస్టరుగారి మీద, శ్రీ సాయిబాబా మీద వుండే అపారమైన భక్తి శ్రద్ధలు ప్రస్ఫుటంగా కనిపించేవి మాకు. నాకు నచ్చిన, వచ్చిన పదార్థాలు (ఫ్రూట్ సలాడ్ లాంటివి) చెయ్యమని ప్రోత్సహించేవారు. వాటిని చేసి, నివేదన ఇచ్చి అందరికీ పంచమనేవారు. పొద్దున్నే బాబా-మాస్టరుగారికి ఆరతితో రోజు మొదలయ్యేది. పూజ్య మాస్టరుగారికి కాఫీ నివేదన చేసేవారు. మధ్యాహ్నం, రాత్రి భోజనం నివేదించేవారు.

పూజ్య అమ్మగారు ప్రతిరోజూ పారాయణ చేసేవారు. ఏ రోజూ ఈ నియమం తప్పేవారుకాదు, ఎంత ఆలస్యమైనా! ఇది మనం అందరం నేర్చుకోవాల్సిన విషయం. 'పారాయణ విషయంలో అలసత్వం పనికిరాదు' అనేవారు.

పూజ్య అమ్మగారు ఆదర్శ గృహిణిగా, తల్లిగా ఎంతో నేర్పరితనంతో వ్యవహరించేవారు. రోజూ ఎంతోమంది దర్శనానికి వస్తున్నా, ఎంతోమంది అక్కడ వుంటున్నా, ప్రతి రోజు కొత్త రోజుగా వున్నా, దైనందిన కార్యక్రమాలలో ప్రతి ఒక్కటి కూడా క్రమం తప్పక నడిచేవి. దేనికీ తొట్రుపాటు వుండేది కాదు. పూజ్య అమ్మగారు ఆ ఇంట్లో ఏ వస్తువులు ఎక్కడ వున్నాయో చక్కగా చెప్పేవారు, వారు తమ అనారోగ్యం కారణంగా కూర్చున్న ప్రదేశం నుంచి కదలలేకపోయినా!

ఎవరు వచ్చినా అదే కరుణ, అదే ఆప్యాయత! ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారు. ఆందోళనా, భయం యిటువంటివి పూజ్య అమ్మగారి వదనంలో నేను ఎప్పుడూ చూడలేదు,



చెరగని చిరునవ్వు తప్ప.

నా వివాహం నా జీవితంలో ఒక పెద్ద మలుపు.

నా వివాహ నిశ్చయ తాంబూలాలు, పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలో జరగడం చాలా అద్భుతమైన సంఘటన. పూజ్యశ్రీ అమ్మగారు ఆశీర్వదించి ప్రసాదించిన నా వైవాహిక జీవితం, నన్ను పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి నించి కొంతకాలం దూరంగా తీసుకువెళ్ళింది!

వివాహం చేసుకుని విదేశాలు వెళ్లాలని, అక్కడ ఏవో చేసేయాలని అని ఎప్పుడూ కలలుగనే నాలో, పూజ్య అమ్మగారి సన్నిధి తెలియకుండానే మార్పు తెచ్చింది.

క్రమక్రమంగా నాకు మరియు నా పిల్లలకి 'ఈ సన్నిధిలో వుంటే బాగుంటుంది' అని అనిపించేది. మాకు యిద్దరు ఆడపిల్లలు. నేను మా రెండవ అమ్మాయి గర్భములో వున్నప్పుడు పూజ్యశ్రీ అమ్మగారితో మాట్లాడుతూ, "ఎప్పటికీ మీ సన్నిధి కావాలమ్మా" అని ప్రార్థించాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు "అలాగే తప్పకుండా" అన్నారు. వారి ఆశీస్సుల ఫలితంగా రెండు సంవత్సరాలలో మేము బెంగుళూరు నుంచి హైదరాబాదు వచ్చేసాం. పూజ్యశ్రీ అమ్మగారికి సేవ చేసుకునే భాగ్యం మాకు దొరికింది. అప్పుడు అమ్మగారు మల్కాజిగిరిలో వుండేవారు.

కొన్నాళ్ళకి పూజ్యశ్రీ అమ్మగారు, మల్కాజిగిరి నించి నాగోలు వెళ్లిపోయారు. పూజ్యశ్రీ అమ్మగారితో పాటు మేము కూడా నాగోలుకి వచ్చేసాము. అక్కడ గురుకుటుంబం సూచనల మేరకు, పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో ఇంట్లోనే విద్య నేర్పించే (హోమ్ స్కూలింగ్) విధానంలోకి మా పిల్లలు అడుగుపెట్టారు. ఇది మా జీవితంలో జరిగిన గొప్పదైన క్రొంగొత్త మలుపు!! నేను పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి కోసం ప్రార్థించినందుకు మా పిల్లలకి కూడా ఆ భాగ్యం దక్కింది. ఇంతకంటే నాకు కావలసినది ఏమి వుంటుంది?

పూజ్య అమ్మగారు ఎలా నా జీవితాన్ని దిద్దారో చూడండి. వివాహం తరువాత కొన్ని రోజులు నేను బెంగుళూరులో వున్నాను నా భర్త ఉద్యోగ రీత్యా. నా పిల్లలతో ఆంగ్లంలో మాట్లాడి వారికి అలా నేర్పించడానికి ప్రయత్నించేదాన్ని. ఒకసారి పూజ్య అమ్మగారి దగ్గర వున్నప్పుడు, అలా చెయ్యడం జరిగింది. అప్పుడు పూజ్య అమ్మగారు, నన్ను మందలించి, "నువ్వు తెలుగు రాక బాధపడింది చాలదా, ఇప్పుడు పిల్లలు కూడా బాధ పడాలా?" అని నా తప్పు గ్రహించేలా చేశారు. ఇలా నేను వేసే ప్రతి అడుగులోనూ వారు నన్ను దిద్దారు. అంతకంటే, నా పిల్లల మీద కరుణ వర్షించారు. నాకు ఉండే సాధారణ ప్రాపంచిక ఆశలు, ఆశయాలు, వాటి అస్సలు రంగు నాకు అర్థమయ్యేలా చేసి, సరి అయిన జీవిత విధానాన్ని చూపారు.

పూజ్యశ్రీ అమ్మగారి సర్వాంతర్యామిత్వానికి ఒక ఉదాహరణ, మేము నాగోలులో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాము. ఆ ఇల్లు చాలా బాగుండేది. నాకు మనసులో పూజ్యశ్రీ అమ్మగారిని ఆ యింటికి ఆహ్వానించుకోవాలని అనిపించేది. ఒకరోజున యథాప్రకారం, సత్సంగం తరవాత నేను, మా పెద్దమ్మాయి పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుంటుంటే, దానితో పూజ్యశ్రీ అమ్మగారు, "రెండు రోజుల్లో నీ పుట్టినరోజు కదా, దాని గురించి ఏం ఆలోచిస్తున్నావు? అందరిని పిలుచుకుంటున్నావా? నన్ను కూడా రమ్మంటావా?" అని అన్నారు. నాకు ఎంతో ఆశ్చర్యానందాలు కలిగాయి! పూజ్యశ్రీ అమ్మగారికి నా మనసులోమాట తెలిసిపోయినందుకు! అన్నమాట ప్రకారం, 2011 ఫిబ్రవరి 26 సాయంత్రం మా ఇంటికి విచ్చేసి, పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్నందరిని అనుగ్రహించి మాకు అమితానందాన్ని కలిగించారు. ఆ తరువాత, బృందంలోని చాలా పిల్లలకు పూజ్య అమ్మగారు స్వయంగా వేడుకలు జరిపించారు, దాన్ని ఒక సాంప్రదాయంగా!

పూజ్య అమ్మగారితో యాత్రలకు వెళ్ళేవాళ్ళం బృందంగా! ఆ యాత్రలు మరపురాని అనుభవాలను మిగిల్చేవి. అందరి భావాలు, అభిప్రాయాలు ఎంతగా దూరం చేస్తాయో, వాటిని బాబా మీద, పూజ్య మాస్టరుగారి మీద తిప్పుకుంటే, ఎంతగా దగ్గర అవుతామో, ఈ యాత్రలు మాకు బాగా నేర్పాయి.

ఒకసారి, పూజ్య అమ్మగారు ఒక చిన్న కథ చెప్పారు. "ఒక ఊళ్ళో ఒక చూపులేని పూజారి వుండేవాడు. ఒక భక్తుడు ఆ గుడికి వచ్చి, ఆ పూజారికి 500 రూపాయలు యివ్వబోయాడు. ఆ పూజారి "నాకు యింత వద్దు. ఒక 5 రూపాయలు యివ్వండి చాలు" అన్నాడుట. "దారిద్ర్యం మనస్సులో వుంటుంది, పరిస్థితుల్లో కాదు" అని చెప్పారు పూజ్య అమ్మగారు. ఇది లౌకికమైన ఆశల నుంచి మనస్సు సరైన దారిలో పెట్టుకోవడానికి నాకు చాలా బాగా ఉపయోగపడింది.

పూజ్య అమ్మగారు మనలను అనుక్షణం గమనిస్తూ వుంటూరు అనడానికి ఒక చిన్న సంఘటన. మేము బెంగుళూరులో వున్నప్పుడు, ఇద్దరు పిల్లలతో ఇంట్లో ఒక్కదాన్నే వుండేదాన్ని. ఒకసారి, నేను చిన్నపిల్లతో వుండగా, పూజ్య అమ్మగారి నుంచి ఫోన్ వచ్చింది. అప్పుడు పూజ్య అమ్మగారు నా పెద్ద పిల్ల గురించి అడిగారు. దాని గురించి చెబుదామని అనుకుంటూ దానివైపు చూద్దును కదా, అది ఒక అగ్గిపెట్టె పుల్లలన్నీ చేత్తో పట్టుకుని, వెలిగించడానికి ప్రయత్నిస్తోంది. ఒక్కసారి పరిగెత్తి ఆ పుల్లలని ఆ చేతుల్లోంచి తీసేసాను. ఏ మాత్రం ఆలస్యమైనా ఏమయ్యేదో అనిపించింది.. పూజ్య అమ్మగారు అలా మనల్ని ప్రతీ క్షణం కాపాడుతుంటూనే వుంటారు.

పూజ్య అమ్మగారి ముఖ వర్చస్సు నాకెంతో ఆకర్షణయంగా వుంటుంది. అమిత తేజోమూర్తిగా కనిపిస్తారు, ఆ తపోనిష్ఠ వల్లనేమో అని అనిపిస్తుంది. అది చూసాక, నాకు బాహ్య సౌందర్యము పెంచుకునే వస్తువుల మీద, అతిగా అలంకరించుకోవడం మీద వుండే ఆలోచనలు పోయాయి. ఆ అంతఃసౌందర్యం మీద అమితమైన ఆకర్షణ కలిగింది. అది ఆధ్యాత్మికంగా ఉన్నతంగా వుంటే వచ్చే వర్చస్సు. అందుకే, పూజ్య అమ్మగారి మార్గం మీద అంత ఆకర్షణ. పూజ్య అమ్మగారు ఎప్పుడూ అందరిలో వుండే మంచిని చూడాలి అనేవారు. దానివల్ల మన మనస్సు ఎప్పుడూ ఉల్లాసంగా ఉత్సాహంగా వుంటుంది అనేవారు. దానికి తోడు, బాబా మీద, పూజ్య మాస్టరుగారి మీద అచంచల విశ్వాసం. ఇవి అందరూ ఆచరించదగ్గ విషయాలు.

నాగోలు కు వచ్చాక, పిల్లల పెంపకం మీద ఎంతో శ్రద్ధ కనపర్చారు. శ్రీ ద్వారకబాబుగారు పిల్లలకు జీవితపు విలువలు, సంప్రదాయాల అవగాహన పెంచుతూ ఉంటే, పూజ్య అమ్మగారు, శ్రీమతి వేదమ్మగారు, వారితో చిన్న చిన్న నాటకాలు వేయించి భక్తి బీజాలు నాటారు. భజనలు, పూజలు, గ్రంథపఠన ఇత్యాదులు చిన్నతనం నుంచి నేర్పించే ప్రయత్నం గురుకులం ద్వారా లభించింది. ఇలా తరతరాలకు ఒక ఒరవడి ఏర్పాటు చేశారు పూజ్య అమ్మగారు.

నేను నా 8 వ ఏట పూజ్య మాస్టరుగారిని, పూజ్య అమ్మగారిని దర్శించినప్పటి నుంచి నా జీవితంలో మొదలైన మార్పు యిప్పటికీ కొనసాగుతూనేవుంది. ఇలా నా జీవితంలో ఎన్నోమార్పులు తీసుకువస్తూ, మా అందరి కోరికలు నెరవేరుస్తూ, మమ్మల్ని అనుగ్రహిస్తూన్న పూజ్యశ్రీ అమ్మగారికి శతాధిక పాదాభివందనములు తెలియచేసుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

# మార్గ దర్శకులు

శ్రీమతి అడిదం వేదవతి

మనందరికీ హాయిగా జీవించాలనిపిస్తుంది. అంటే ఎటువంటి చీకూ చింతా లేని జీవితం కావాలనిపిస్తుంది. అటువంటి జీవితం ఒకటి సాధ్యమని, దానిని సాధించవచ్చని మన నమ్మకం. అదే మానవ జీవితాన్ని నడిపేటటువంటి ఆశ. అటువంటి జీవితం కోసమే ప్రతి మనిషి నిరంతరం ప్రయత్నిస్తూ వుంటాడు. అన్వేషిస్తూ వుంటాడు. తాను చేసే ప్రతి ప్రయత్నానికీ అంతిమ పర్యవసానం అంతులేని తృప్తి, చెక్కుచెదరని శాంతి, ఆనందాలు కలిగిన జీవితమే. కానీ ఎక్కువమంది అట్టి జీవితాన్ని సాధించకుండానే, దాని కోసం అన్వేషిస్తూనే జీవితాన్ని ముగిస్తారు.

ఎందుకంటే వారు తమకట్టి జీవితం లభించడానికి వచ్చే అడ్డంకులను తొలగించుకోచూస్తారు - బాహ్యంగా. అంటే మంచి ఉద్యోగము, ధనము, కుటుంబము అట్టి జీవితాన్ని సాధించగలిగేందుకు సాధనాలుగా నమ్మి వాటి కోసం ప్రయత్నిస్తూ కాలమంతా గడిపేస్తారు. చివరకు అట్టి జీవితం అసాధ్యమేననే పరోక్ష నమ్మకానికి లోనై, తాము సాధించిన చిన్న చిన్న విజయాలను చూసి గర్విస్తూ, అహంకరిస్తూ తృప్తి పడిపోతారు. లేదా అసంతృప్తితో మరణిస్తారు.

కానీ మానవులందరూ తరతరాలుగా నిరంతరం అన్వేషిస్తూవున్న అట్టి చీకూ చింతా లేని హాయైన జీవితం సాధ్యమేనా? అంతులేని తృప్తి, శాంతి, ఆనందాలతో కూడిన అత్యంత ఉన్నత జీవితం మనం సాధించవచ్చా? దీనికి సమాధానం మహాత్ముల జీవితాలు, బోధలే! ఎందుకంటే మహాత్ములు మాత్రమే మనం నిత్యం అన్వేషించే చీకూచింతా లేని హాయైన జీవితం గడుపుతూవుంటారు. వారి శాంతిని, తృప్తిని, ఆనందాన్ని ఈ



ప్రపంచంలో ఏదీ చలింపచేయలేదు. వారి జీవితాలే అందుకు ఉదాహరణలు. వారే అట్టి జీవితాన్ని సాధించే మార్గాలను అనేకం చూపుతారు. నిజానికి వారే మానవాళికి ఆశాజ్యోతులు. వారే నిజానికి మనకు మేలు చేయగలిగినవారు. వారు చెప్పిన మార్గంలో ప్రయత్నించి అటువంటి జీవితాన్ని సాధించగలిగిన వారెందరో చరిత్రలో వున్నారు. అట్టి జీవితాన్ని ఎలా సాధించాలో ఆ జీవితాన్ని

సాధించినవారినుండే కదా మనం తెలుసుకోగలం?

అంతేకాదు. శారీరిక, మానసిక ఆరోగ్యాలతో పాటు సాంఘికమైన ఆరోగ్యము సాధించడంలో ప్రకృతిలో భాగాలైన మనం ప్రకృతితో సామరస్యంగా సహకరిస్తూ ఐహికమైన సుఖశాంతులను ఎలా పొందవచ్చో చెబుతూనే పొందగలిగే ఆంతరింగిక స్థితిని సాధించు కొనేందుకు, వాటిని పొందేందుకు మార్గాలను ఆయా దేశకాల పరిస్థితులననుసరించి తెలుపగలిగేవారే సద్గురువులు. అంతేకాదు. మానవుడి ఆంతరంగిక, వ్యక్తిగత స్థాయిలలోని స్పర్ధలను మాత్రమేగాక సాంఘికంగానూ వచ్చే వివిధ స్పర్ధలను ఎలా తొలగించుకోవాలో సద్గురువులు తమ జీవితము, బోధలద్వారా మనకు తెలియజేస్తారు. సాంఘిక ఆచారాలను, వ్యవస్థలను, మతాల మధ్య విభేదాలను సంస్కరించి ధైర్యంగా, నిజాయితీగా ఎలా జీవించవచ్చో వారు మనకు తెల్పి ధర్మబద్ధమైన జీవితపు ఆవశ్యకతను తెలియజేస్తారు. సర్వశక్తిమయము, చైతన్యమయము అయిన ఒకే భగవత్తత్త్వాన్ని సర్వానికీ ఆధారంగా తెలిపి దానిపట్ల సరియైన అవగాహన కలుగజేస్తారు. భగవంతు డొక్కడేనని అన్ని మతాలూ చెబుతాయి. ఆ సత్యాన్ని అనుభవపూర్వకంగా సద్గురువు తమను ఆశ్రయించిన వారికి నిరూపిస్తారు. తద్వారా అన్నింటికీ ఆధారమైన భగవంతుని తత్త్వాన్ని భక్తుని హృదయంలో స్థిరపరుస్తారు. వారి లీలలు పామరులకు సైతం ఈ సత్యాన్ని నిరూపిస్తాయి. అటువంటి మహాత్ములే లేకుంటే మనమాశించే అంతులేని తృప్తి, శాంతి, ఆనందాలు గల జీవితం అసాధ్యమనే నిర్ణయానికి మానవజాతి వచ్చేసేదేమో!

కనుక అటువంటి సద్గురువును అన్వేషించి, ఆశ్రయించి వారి మార్గదర్శకత్వంలో జీవితం గడుపగలిగినప్పుడే మన జీవితాన్వేషణ సరిగా జరుగు తుందన్నమాట! కనుక సద్గురువును ఆశ్రయించనిదే మన జీవితం సార్థకం కాదన్నమాట! మనదేశ కాలపరిస్థితుల కనుగుణమైన రీతిన నేటి మన జీవిత సమస్యలన్నింటికీ సమాధానంగా వచ్చిన సద్గురుమూర్తులే శ్రీ భరద్వాజ మాస్టరుగారు. వారు తమ సద్గురువైన శ్రీ సాయినాథుని బోధలను, లీలలను నేటి మన జీవిత సమస్యలకు పరిష్కారమార్గంగా అన్వయించి చూపించడమే గాక ఆ సద్గురు మార్గంలో జీవించి తరించడమెలాగో నిరూపించిన నేటి యుగావతారం, ఒక సాటిలేని శిష్యుడు, ఒక సాటిలేని సద్గురువు. కనుక ఆయన గురించి తెలుసుకొని, ఆయనను ఆశ్రయించి, ఆయనను సేవించి తరించడమే మనం చేయవలసినది!

# సద్గురువుల నిత్యదర్శనం

"సర్వగతమైన ఆత్మ ఒక్కటేనన్న పరమసత్యం మన నిత్య జీవితానుభవానికి వ్యతిరేకం. కాని అట్టిదాన్ని అంగీకరిస్తే తప్ప ప్రతి మానవుడూ సాటివారిని తనవలెనే ప్రేమించడమన్న ప్రాథమిక ధర్మసూత్రానికర్థముండదు. ఆ సూత్రాన్ననుసరించే సకల ధర్మశాస్త్రాలు ఏర్పడ్డాయి. కాని అట్టి ప్రత్యక్షానుభవం లేకపోవడంచేతనే సామాన్యులకు ధర్మాన్ననుష్ఠించడమంత కష్టమౌతుంది. అట్టి అనుభవాన్ని తాము పొంది, తదనుగుణమైన విధంగా జీవిస్తూ, అట్టి అనుభవాన్నాధారంగా గల లీలలను ప్రకటించి భక్తుల జీవితాలను ధర్మబద్ధంగా తీర్చిదిద్దగలవారే మహాత్ములు."

**- పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# విశ్వమాత శ్రీ అలివేలుమంగమ్మకు జోహార్లు!

శ్రీమతి శ్రీదేవి

మహాత్ములు భూమి పైకి యెందుకు వస్తారు? అన్న ప్రశ్నరాని వారు వుండరు. అందుకు సమాధానంగా భగవంతుడు శ్రీకృష్ణ భగవానుడు "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" (దుష్టశిక్షణ శిష్టరక్షణ గావించి ధర్మ సంస్థాపన చేయటానికి యుగయుగాలలో అవతరిస్తాను) అని స్వయంగా చెప్పటం జరిగింది.

అదే విధంగా ధర్మసంస్థాపన కోసం, భక్త జనోద్ధరణ కోసం అవతరించిన శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్ని శ్రీ అలివేలుమంగా మాత జన్మదినాన్ని అక్టోబరు 1, 2023వ తేదీన మనమంతా సంతోషంగా జరుపుకొంటున్న సందర్భంగా ఆమె దివ్యజీవితంలోని కొన్ని విషయాలను భక్తితో స్మరించుకొందాం.

శ్రీ అలివేలుమంగా మాత జీవన గమనాన్ని పరిశీలిస్తే ఆమె వ్యక్తిత్వంలోనే కాదు, ఆమె జీవిత ప్రయాణంలో యెన్నో విశేషాలు మనకు కన్పిస్తాయి. ముఖ్యంగా యే మహాత్ముని లేక మహాత్మురాలి జీవితాన్ని గమనించినా వారి పూర్వీకులు భక్తులుగా, యోగులుగా వుండటం వారి జీవిత చరిత్రల్లో కనిపిస్తుంది. అలాగే తరతరాలుగా మహా భక్తులు, యోగులు జన్మించిన వంశంలో శ్రీ అలివేలుమంగమ్మ గారు జన్మించడం జరిగింది. తల్లి శ్రీమతి రంగనాయకమ్మగారు చిన్ననాటి నుండి శ్రీ కోదండ రామస్వామి భక్తురాలు. ఆమెకు సిద్ధ పురుషులు, గొప్ప మహాత్ములు అయిన శ్రీ రమణ మహర్షి, శ్రీ అక్కల్ కోట మహారాజ్, శ్రీ శిరిడీ సాయిబాబా తను ప్రత్యక్ష దర్శనాన్ని ప్రసాదించి ఆశీర్వదించారు. అలాగే ఆమె తండ్రి శ్రీ మన్నవ బాలకృష్ణ శర్మగారు నిరంతర రామనామ స్మరణ ప్రియులు. అటువంటి తల్లిదండ్రులకు జన్మించి వారి శిక్షణలో పెరిగిన శ్రీ అలివేలుమంగా మాత కూడ చిన్ననాటి నుండి భజనలు, పూజలు ఎంతో యిష్టంగా చేస్తుండేవారు. వీరి దగ్గరి బంధువు, మహాయోగిని శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మగారి నామాన్ని నిరంతరం శ్రీ అలివేలు మంగమ్మ




యేమరక జపిస్తుండేవారు. తల్లిగారైన శ్రీ రంగనాయకమ్మగారు యింటి పనులు చేసుకుంటూ పాడుకునే భక్తిగీతాలను, ఆధ్యాత్మరామాయణ కీర్తనలను శ్రద్ధగా తల్లి నుండి నేర్చుకుని పాడుతుండేవారు.

ఆ విధంగా భక్తిపూరిత గృహ వాతావరణంలో బాల్యావస్థ గడచిపోయింది. ఆ తర్వాత 16 సంవత్సరముల వయస్సులో ఆమె జీవితాన్ని జిల్లెళ్ళమూడి ఆశ్రమవాసం గొప్ప మలుపు తిప్పింది. ఒకసారి కుటుంబసభ్యులతో జిల్లెళ్ళమూడి వెళ్ళిన దివ్యజనని అలివేలు మంగమ్మ, అమ్మ పట్ల ఆకర్షితురాలై, ఆమె

సన్నిధిలోనే జీవితాంతం వుండిపోవాలని నిర్ణయించుకొని, కుటుంబ సభ్యులతో తిరిగి యింటికి వెళ్ళకుండా జిల్లెళ్ళమూడిలోనే వుండిపోయారు.

అలా ఒక మహాత్మురాలి సాంగత్యంలో ఏడు సంవత్సరాల కాలం గడచిపోయింది. జిల్లెళ్ళమూడిలో "జయహో మాతా శ్రీ అనసూయ, రాజరాజేశ్వరి, శ్రీ పరాత్పరి" అనే అమ్మ నామాన్ని నిరంతరం జపిస్తూ, ఆశ్రమ సేవాకార్యక్రమాలలో నిరంతరం శ్రమిస్తూ గడిపిన ఆమె శరీరం, మనస్సు- అత్యంత పవిత్రతను, స్వచ్ఛతను పొందాయి. ఆ దీర్ఘకాల సాధనలో ఆమె మనస్సు అంతర్ముఖమై ఆధ్యాత్మిక పరిణతి సాధించి, లక్ష్యసిద్ధిని సాధించటానికి కావలసిన అర్హతను సంపాదించుకొన్నది. జిల్లెళ్ళమూడి అమ్మను శ్రీ అలివేలుమంగా మాత తను, మన, ప్రాణాలతో త్రికరణ శుద్ధిగా సేవించారు. అమ్మ పట్ల ఆమె అంకితభావం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శిష్యుడైన సిద్ధయ్యను గుర్తుకు తెస్తుంది. ఆ రోజులలో అమ్మ నామస్మరణ తప్ప ఆమెకు మరొక లోకం కనిపించేదికాదు. అంతకు ముందువరకు తల్లిదండ్రులు, తోబుట్టువుల పట్ల యెంతో మమకారంతో మెలిగే ఆమె, అందరినీ మరిచిపోయింది. భవిష్యత్తు గురించిన చింత, జీవితంపై ఆశలు, సుఖసౌఖ్యాలపై ఆసక్తి, ఆమెలో యేమాత్రం కనిపించేవికావు. ఆమెది ఒకే ఒక్క కోరిక – 'జిల్లెళ్ళమూడి అమ్మ సేవలోనే, ఆమె సన్నిధిలో సేవలో తాను తరించాలి!' ఆ రోజులలో ఆమె తీవ్ర అనారోగ్యం పాలయింది. శక్తికి మించిన శారీరిక శ్రమ ఆమె ఆరోగ్యాన్ని క్షీణింపజేసింది. చివరకు చిక్కి శిల్యమై కేవలం ప్రాణం మాత్రమే మిగిలివున్న ఒక ఎముకల ప్రోగులాగా ఆమె శరీరం మారిపోయినా, శరీరంలో శక్తి పూర్తిగా నశించినా ఆమె బాధపడడం యెవరూ చూసివుండరు. అటువంటి పరిస్థితిలో కూడా ఆమె విశ్రాంతి తీసుకొనక ఒక్కరోజయినా అమ్మను యేమరక సేవించుకొనేవారు. రాను రాను ఆమె ఆరోగ్యం మరింత క్షీణించటంతో అమ్మగారు వైద్యం నిమిత్తం ఆమె అన్నగారి వెంట శ్రీ అలివేలు మంగమ్మను ఇంటికి పంపడం జరిగింది. అమ్మ సన్నిధిని వీడలేక దుఃఖిస్తున్న శ్రీ అలివేలుమంగమ్మగారిని అమ్మ ఎంతగానో నచ్చజెప్పి ఓదార్చి పంపారు.

ఇక్కడ యీ సందర్భంలో శ్రీ ప్రతాపకోటయ్యగారు



అనే సిద్ధపురుషుని జీవితంలోని విషయం ఒకటి జ్ఞాపకం వస్తుంది. మన్నవ గ్రామంలో నివసించిన ఒక యోగీశ్వరుడైన శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారు యిల్లు విడిచి కాశీ వెళ్ళి అక్కడ ఒక మహనీయుని గురువుగా స్వీకరించి ఆయన శిష్యరికంలో కొంతకాలం తపోసాధనలో గడిపి, ఆ తర్వాత గురువు ఆదేశంతో యింటికి తిరిగివచ్చి గృహస్థాశ్రమం స్వీకరిస్తారు. ఇంటికి తిరిగి వచ్చిన ఆయనలో యెంతో విశేషంగా ప్రస్ఫుటమౌతున్న దివ్య తేజస్సును, తపోశక్తిని చూసి కుటుంబసభ్యులు దిగ్భ్రాంతులవుతారు. అదే విధంగా జిల్లెళ్ళమూడి నుండి తిరిగి వచ్చిన శ్రీ అలివేలు మంగామాతలోని మార్పు చూచి అందరూ యెంతో ఆశ్చర్యపోయారు. ఆమె మునుపటి మంగమ్మగారు కాదని, యిప్పుడు ఆమె లౌకిక బంధాలకు దూరంగా ఆధ్యాత్మిక ప్రపంచంలో విహరిస్తున్న యోగిని అని వారు గుర్తించారు.

జిల్లెళ్ళమూడి నుండి తిరిగి వచ్చిన తర్వాత మొదట్లో కొన్నిరోజులు ఆమె చాలా మౌనంగా వుండేవారు. ఆమె

నిరంతర దైవచింతనలో వున్నట్లు కన్పిస్తున్నా, మరొక వంక ఆమెలో కన్పిస్తున్న నిర్లిప్తత, నిరుత్సాహం చూచిన వారికి ఆమె దేని గురించో బాధ పడుతున్నట్లుగా తెలుస్తుండేది. కాని యెవ్వరూ కూడా ఆమెను యెందుకు బాధ పడుతున్నావని అడుగలేకపోయారు. అయితే కొన్ని సంవత్సరాల తర్వాత ఒక సందర్భంలో ఆమె యీ విషయం గురించి యిలా చెప్పారు:

"జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో జీవితాంతం గడపాలని; అలా అమ్మకే, అమ్మ సేవకే యీ జీవితంలోని ప్రతి క్షణాన్ని అంకితం చేసి చివరకు ఆమె పాదాల చెంత తుది శ్వాస విడవాలని మొదటిసారి జిల్లెళ్ళమూడి అమ్మను దర్శించిన క్షణంలోనే నిర్ణయించుకున్నాను. కానీ నా కోరిక ఫలించలేదు. అమ్మ నన్ను తన సన్నిధికి దూరం చేశారు. నేనేమి పాపం చేశాను? అమ్మ యిలా ఎందుకు చేశారు? అని ఆలోచిస్తూ, ఎంతగానో కుమిలిపోయాను. రోజుల తరబడి దుఃఖించాను. నా జీవితమంతా గాఢాంధకారం అలముకున్నట్లయింది. చివరకు 'అమ్మ సన్నిధి కోల్పోయిన యీ జీవితం అనవసరం' అని భావించి చనిపోవాలని కూడా అనుకున్నాను. సరిగ్గా ఆ సమయంలో ఒకరోజు ఇంటి వెనుక వరండాలో ఒంటరిగా కూర్చుని కనులు మూసుకొని అమ్మను ధ్యానిస్తూ మౌనంగా రోదిస్తున్నాను. ఆ సమయంలో సాయినాథుని దివ్యరూపం నా కనుల ముందు ప్రత్యక్షమైంది. "ఎందుకు యేడుస్తావు. నిన్ను యిక్కడకు రప్పించింది నేనే! ఒక కారణంతో నిన్ను యిక్కడకు రప్పించాను. ఆ విషయం ముందు ముందు నీకు తెలుస్తుంది. బాధపడవద్దు!" – ఈ మాటలు పలికి శ్రీ సాయి అదృశ్యులైనారు. ఆ దర్శనం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. సాక్షాత్తు భగవంతుడైన శ్రీ సాయినాథుడు నాకు యిలా దర్శనం యివ్వడం యేమిటి? ఇలా నాతో అభయమిస్తూ మాట్లాడటం యేమిటి? ఇది నిజమా, కలా? అనిపించింది. చాలాసేపటిదాకా ఆ దివ్యానుభూతితో పరిసరాలను కూడా మరచిపోయాను. ఆ తరువాత ఆ స్థితి నుండి బయటపడిన నా మనసు దివ్యమైన శాంతి, ఆనందాలతో నిండిపోయింది. చిత్రంగా ఆ క్షణం నుండి నా మనసులోని వేదనంతా మాయమైపోయింది. తన మధురవాక్కులతో నన్ను ఓదార్చి ఆశీర్వదించిన శ్రీ సాయినాథుని దివ్య రూప దర్శనం యిప్పటికీ – యీనాడే జరిగినట్లు అనిపిస్తుంటుంది." ఈ



విధంగా శ్రీ అలివేలుమంగా మాత తన దివ్యానుభవాన్ని తెలియజేశారు.

శ్రీ అలివేలు మంగమ్మగారి తండ్రిగారైన శ్రీ మన్నవ బాలకృష్ణ శర్మగారు కొన్ని సంవత్సరాలకు ముందు – అమ్మ జిల్లెళ్ళమూడిలో వున్న సమయంలోనే – స్వర్గస్థులవటం జరిగింది. తండ్రి మరణానంతరము ఆయన పెద్ద కుమారుడైన శ్రీ మన్నవ బుచ్చిరాజు శర్మగారు కుటుంబ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా బనగానపల్లె పట్టణంలో టుబాకో కంపెనీలో పనిచేస్తుండేవారు.

బనగానపల్లెలో తమ ఇంట్లో శ్రీ అలివేలుమంగా మాత శ్రీ సాయినాథుని దర్శనానంతరం పూర్తిగా తన సాధనలో మునిగిపోయారు. నిరంతరం పూజలు, జపధ్యానాదులు, భజనలు, సత్సంగాలు – ఇలా పూర్తి ఆధ్యాత్మిక చింతనలో ఆమె దినచర్య గడిచేది. ఇంట్లోని వారందరినీ కూడా ఆమె దైవ కార్యక్రమాలలో పాల్గొనేలాగా ప్రోత్సహించేవారు. ఆమె ప్రోత్సాహంతో కుటుంబ సభ్యులందరూ పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో గడప నారంభించారు. ఆ గృహం ఒక ఋష్యాశ్రమం వలె రూపు మారిపోవడం జరిగింది.

అలా బనగానపల్లెలో సాధనలో గడుపుతున్న కాలంలో శ్రీ సద్గురు సాయినాథుని సంకల్పంతో అనూహ్యంగా శ్రీ అలివేలుమంగా మాత వివాహం శ్రీ భరద్వాజ గురుదేవులతో జరిగిపోయింది! అంతటితో ఆమె జన్మ చరితార్థమయ్యింది!

ఆమె ఆశించిన తపఃఫలం చేతికందింది. దైవం సాకారుడై పతిదేవుని రూపంలో ఆమెను స్వీకరించటంతో ఆమె జీవితం సంపూర్ణ ఆనందమయ, ఆధ్యాత్మిక లక్ష్యాన్ని అందుకున్నట్లయింది.

వైకుంఠ లోకంలోని లక్ష్మీదేవి లాగా, నిరంతర భరద్వాజ గురుదేవుల సన్నిధిలో, వారి సేవలో వారి కన్నబిడ్డల ఆలన, పాలనలో, కన్నబిడ్డల వలె తమనాశ్రయించిన భక్తుల నాదరిస్తూ ఆమె జన్మ సార్థకతను పొందగలిగారు. లోకమంతా తమ కుటుంబమే అని చెబుతూ, తరచూ భక్తులతో "మీరందరూ ఈ కుటుంబ సభ్యులే. మా కన్నబిడ్డలే. ఈ ఇల్లు మన అందరిదీ" అంటూ వుండేవారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు యింతకుముందు యేమాత్రమూ పరిచయం కూడా లేని కొత్తవారు కూడా రోజుల తరబడి, నెలల తరబడి వీరి ఇంట్లో స్వేచ్ఛగా వుండగలిగేవారు. అలా భక్తులను ఆదరిస్తూ విశ్వమాతగా శ్రీ అలివేలుమంగా మాత అందరికీ తన మాతృప్రేమను పంచారు.

ఇలా యిప్పటివరకు మనం చెప్పుకున్నది ఆమె తుదిశ్వాస వరకు గడిచిన ఆమె జీవిత ప్రయాణపు మౌలిక స్వరూపం మాత్రమే. ఇంతకుమించి ఆమె జీవిత ప్రయాణంలో మనం గమనిస్తే ఎన్నో అద్భుతమైన అసామాన్యమైన అంశాలు దర్శనమిస్తాయి. వాటిలో కొన్నింటిని నా అవగాహనకు అందినంతవరకు వివరిస్తాను.

మొట్టమొదటి విషయం, విశేషం మొదటి నుండి చివరి వరకు ఆమె జీవితమంతా మహాత్ముల సాంగత్యంలోనే గడిచిపోయింది. బాల్యంలో దైవభక్తులు, దైవసాక్షాత్కారం పొందిన వారైన తల్లిదండ్రుల దివ్యసాంగత్యంలో గడచింది. ఆ తరువాత జిల్లెళ్ళమూడిలో తీవ్ర తపోసాధనలో జిల్లెళ్ళమూడి అమ్మ వంటి గొప్ప మహాత్మురాలి సన్నిధి ఆమెకు ప్రాప్తించింది. ఆ తదుపరి జీవితమంతా  దత్త స్వరూపులు శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్నిగా ఆయన సన్నిధిలో గడిచిపోయింది. ఇలా జన్మించినది మొదలు తుది వరకు ప్రతి ఒక్కరోజు, ప్రతి ఒక్క క్షణము మహాత్ముల సన్నిధి భాగ్యాన్ని అనుభవిస్తూ గడపటం జరిగింది. ఇలా సాధారణ మానవులకు ఎవ్వరికీ ప్రాప్తించని ఒక మహాభాగ్యాన్ని పొందిన భాగ్యశాలిగా శ్రీ అలివేలుమంగా మాత మనకు కనిపిస్తారు.

ఆ తదుపరి అంశం వివాహానంతరం గృహస్థ ధర్మాచరణలో ఆమె నూటికి నూరుపాళ్ళు త్రికరణ శుద్ధిగా ధర్మం పాటించి సఫలీకృతులవటం. నిజానికి ఒక మహాత్ముని ధర్మపత్నిగా ఆమె పొందిన భాగ్యం ఎంతటి గొప్ప వరమో అంతకంటే ఎక్కువగా ఆ స్థానానికి న్యాయం చేకూర్చటమనేది ఒక అగ్ని పరీక్ష అని, కత్తి మీద సాము వంటిదని సాధారణ ప్రజలకు ఊహకు కూడా అందని విషయం. భగవత్ స్వరూపులు, ధర్మాత్ములు అయిన శ్రీ భరద్వాజ మాస్టరుగారు అమ్మగారి ప్రతి చర్యను పర్యవేక్షిస్తూ ప్రతిక్షణం ధర్మం తప్పక నడవాలన్న విషయాన్ని హెచ్చరిస్తూ, ఐహిక ఆధ్యాత్మిక రంగాలలో ఆమెకు మార్గనిర్దేశం చేస్తుండేవారు ఆయన ఏ విషయంలోనూ, యే చిన్న పొరపాటు జరగకుండా తన ధర్మవర్తనతో ఆమెకు స్ఫూర్తిదాయకుడై నిలిచేవారు. ధర్మాచరణకు పర్యాయపదంగా త్యాగం అన్నమాటను చెప్పవచ్చు.

శ్రీ భరద్వాజ మాస్టరుగారు





త్యాగం అన్న పదానికి ప్రతిరూపమా అన్నట్లు తన సొంత ప్రయోజనాలకు విలువనివ్వక, సుఖవంతమైన జీవితానికి ఎప్పుడూ దూరంగానే వుంటూ, కేవలం భక్తజనోద్ధరణకే అహర్నిశలు పాటుపడేవారు. ఆయన అర్ధాంగిగా శ్రీ అలివేలుమంగా మాత కూడా ఆయన అడుగుజాడలలో నడుస్తూ తన ఆరోగ్యం యేమాత్రం సహకరించకపోయినా తన ఇంటికి నిరంతరం వస్తుండే భక్తులను ఆదరిస్తూ, వారికి ఆధ్యాత్మ బోధలు చేస్తూ గృహకృత్యాలు నిర్వహించుకుంటూ కూడా తన సాధన కొనసాగిస్తుండేవారు.

శ్రీ మాస్టరుగారు ఎప్పుడూ భక్తుల మధ్యనే వుండేవారు. ఆయనతోపాటు అమ్మగారికి కూడా వేళకు ఆహారము, నిద్ర వుండవు. విశ్రాంతి అసలే వుండదు. నియమిత వేళలు లేకుండా ఇంటికి వచ్చే భక్తులకు భోజనము, వసతి సదుపాయాలు చూడటం ఆమె ధర్మం. శ్రీ గురుదేవుల సేవ, పిల్లల పెంపకము ఇలా అన్ని బాధ్యతలు చిరునవ్వుతో నిర్వహించే వారే కానీ యేనాడూ కొంచెం కూడా విసుగు చెందేవారు కాదు. అలా ఆమె ఐహిక ధర్మాలు నిర్వర్తిస్తూ కూడా అహర్నిశలు ఆధ్యాత్మిక చింతనలోనే నిమగ్నమై వుండేవారు. ఐహికము, ఆధ్యాత్మికము – ఈ రెండు వేరువేరు అంశాలు కావని చెబుతూ, ఈ రెండింటిని సాధనగా ఎలా మలుచుకోవాలో ఆమె బోధించినంత బాగా మరెవ్వరూ బోధించలేరనిపిస్తుంది. నిద్ర లేచినది మొదలు మనం చేసే ప్రతి చర్య – ఇల్లు, వాకిలి శుభ్రపరచుకొనటం, స్నానం చేయటం, వంట చేయటం, భర్త, పిల్లల సేవ, అతిథి అభ్యాగతుల సేవ – ఇలా అన్ని విషయాలను భగవత్సేవగా యెలా సమన్వయం చేసుకోవాలో వివరించేవారు. భగవన్నామాన్ని యేమరక స్మరిస్తూ ఇంటి పనులు చేసుకోవాలని ముఖ్యంగా స్త్రీలను హెచ్చరించేవారు.

గృహకృత్యాలన్నీ భగవత్సేవలుగా భావించాలని చెప్పేవారు. తాము స్వయంగా యివన్నీ పాటిస్తూ అందరికీ తానే ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచేవారు. బంధుమిత్రులు, స్వజనులు తన కుటుంబ సభ్యులు – వీరి పట్ల యేనాడూ ప్రత్యేక దృష్టిని ప్రదర్శించలేదు. భగవంతుని ప్రేమ తప్ప యెవ్వరి ప్రేమానురాగాలను ఆశించలేదు. జీవితంలో యెటువంటి బాంధవ్యాలకు, స్నేహాలకు విలువనివ్వక లౌకిక జనుల వలె సరదాలు, షికార్లు, విలాసాలు, విహారయాత్రలు – వీటికి తన మనస్సులో యే కొంచెం కూడా ప్రాముఖ్యత నివ్వలేదు. సాధారణ గృహిణి వలే కాక, ఒక మహాత్ముని ధర్మపత్నిగా ఒక దైవాంశ సంభూతురాలిగా ఆమె తన ధర్మాన్ని నిర్వర్తిస్తూ, భక్త రక్షణకే ప్రాముఖ్యత నిచ్చి, లోకానికి ఆధ్యాత్మిక వెలుగులను అందించారు.

మహాత్ముల విషయంలో సాధారణంగా మనం గమనించని, ఊహించని మరొక విషయాన్ని ప్రస్తావిస్తాను.

మహాత్ములు మన కోసమే దేహాన్ని ధరిస్తారు. మన కోసమే జీవిస్తూ, మన కోసమే తమ సమయాన్నంతా వెచ్చిస్తూ తమ జీవిత పర్యంతం మన కోసమే శ్రమిస్తారు. ఇక్కడ మనం గమనించవలసిన విషయం యేమిటంటే – మన కోసం దిగివచ్చిన ఆ మహనీయులు లోకంలో మన నుండి ఎన్నో కష్టాలను యెదుర్కొంటారు. కన్నతల్లి వలె ఓర్పుతో ప్రతి మహాత్ముడు, మహాత్మురాలు కూడా తమ బిడ్డలమైన మనకోసం ఈ లోకంలోకి దిగివచ్చి ఎన్నో బాధలను భరిస్తూ, సమస్యలను ఎదుర్కొంటూ కూడా మనలను ద్వేషించక మనల నాదరిస్తూనే వుంటారు. మనలను తిరస్కరించక మన వలన వాళ్ళు బాధపడుతూ కూడా మనందరికీ తమ ప్రేమను పంచి ఆశీర్వదిస్తారు. ఇలా తమ జీవితాలను మనకే అంకితం చేస్తారు.


శ్రీ అలివేలుమంగా మాత తీవ్ర అనారోగ్యంలో కూడా అందరికోసం శ్రమించారు. రానురాను ఆరోగ్యం మరింతగా క్షీణించి నడవలేని స్థితి నుండి మంచానికి పరిమితమై జీవించే పరిస్థితుల్లో కూడా భక్తుల నాదరిస్తూనే వున్నారు. శ్రీ గురుదేవుల వలెనే ఆమె కూడా కొందరు భక్తుల నుండి సమస్యలను విమర్శలను యెదుర్కొన్నారు. అయినా మన కోసం శ్రమిస్తూ భక్తులను ఆదరించారు. వరదాయిని అయి భక్తుల కోరికలు తీరుస్తూ, కష్టాలు తొలగిస్తూ దైవంగా నిలిచారు. ఇలా చివరివరకు తన జీవితాన్ని మనకే అర్పించారు.


అపూర్వ త్యాగశీలి, వరదాయిని, ప్రేమమూర్తి, విశ్వమాత శ్రీ అలివేలు మంగమ్మ తల్లికి జోహార్లు!ఆ దివ్య జనని చరణకమలాలకు శతకోటి వందనాలు!! ●

# మధురమైన ఆత్మవంచనలో మునగరాదు

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

సాయినాథుడు తన మహిమ చేత భక్తులను రక్షించడమే కాని, వారికి ఎట్టి సాధనా మార్గాలు బోధించలేదని సామాన్యంగా మనకు లభించే చరిత్ర గ్రంథాలు చూసినవారికి అనిపిస్తుంది. అందుకు కారణం సామాన్య మానవనైజం – తాత్కాలికమైన లౌకిక ప్రయోజనాలను సాధించుకోవడం, కష్టాలను తొలగించుకోవడంపట్ల గల ఉత్సుకతే. ఎక్కువ మంది రచయితలు సాయిలోని ఈ అంశం మీదనే తమ దృష్టిని కేంద్రీకరించి పరిమితం చేసుకుని చరిత్రలు వ్రాయడమే ఇందుకు కారణం. కానీ తాము భక్తుల కోర్కెలు నెరవేర్చడం కష్టాలు తీర్చడం వారిని తమవైపు ఆకర్షించుకొని శుభ్రమైన మార్గాలలోనికి ఆకర్షించడానికేనని స్పష్టంగా ఒక భక్తునికి చెప్పిన విషయం నా చేత సాయి వ్రాయించుకున్న సమగ్రమైన 'సాయిబాబా జీవితచరిత్ర' (శ్రీ సాయి లీలామృతం) చూస్తే తెలియగలదు. ఆ విధంగా ఆకర్షింపబడి సాయిభక్తిలో మనం స్థిరపడ్డాక నిజమైన సాధకదశ మన కర్తవ్యమవుతుంది. నిజమైన ముముక్షువు, పరమార్థాన్ని కోరువాడు సాయిలీలల మాధుర్యంతోనే తృప్తిచెందక, ఆయన మనకు అందించిన సాధనామార్గాన్ని అర్థం చేసుకోజూస్తాడు. అప్పుడే అది అతడికి లభ్యం అవుతుంది. కానీ ఎక్కువమంది తాము ముముక్షువులమని భ్రమించినా "సాధన కూడా ఆయనే మనచేత చేయించుకుంటాడు" అని భ్రాంతియుతమైన మధురోక్తులతో తమను, సాటివారిని కూడా వంచించుకుంటారు. నిజమైన సద్గురువెవ్వరూ అటువంటి భ్రాంతికి తమ బోధలలో తావు ఇవ్వలేదు. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, బుద్ధుడు, క్రీస్తు, మహమ్మద్, శంకరాది ఆచార్యులు, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి మొదలైన సద్గురువులందరూ భక్తిశ్రద్ధలను ఆధారం చేసుకొని మానవుడు తనను తానే ఉద్ధరించుకోవాలనీ, అందుకు వలసిన బలాన్ని (ఆత్మ) ప్రసాదించమని భగవంతుని, గురువును శరణుపొంది సేవించడం కూడా ఇట్టి యత్నంలోని భాగమేనని చెబుతూ





వచ్చారు. అలానే సాయి కూడా నిష్ట, సబూరీలను దక్షిణగా సమర్పించి నిరంతరం గురు ధ్యాన, సేవాదుల ద్వారా తనను తానే ఉద్ధరించుకోవాలని రాధాబాయి అనే భక్తురాలికి తమ గురుసేవ వృత్తాంతం ద్వారా బోధించడం గమనించాలి. సాధన మన కర్తవ్యం అని వారు తెలిపారు అనడానికి రెండు ఉదాహరణలు:

ఒక భక్తుడు సాయి చెప్పినా త్రాగుడు మానుకోకపోతే "నేనొకటి రెండుసార్లు హెచ్చరిస్తాను. వినకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను" అన్నారు. తన సాటి భక్తుని పరోక్షంగా తనివితీరా నిందిస్తున్న వేరొక భక్తునితో సాయి, "నిందించేవాడు తన పుణ్యాన్ని అవతల వాడికి యిచ్చి, వాడి పాపాన్ని తాను స్వీకరిస్తాడు. నీవిలా చేస్తే శిరిడీకి వచ్చి మాత్రం ప్రయోజనం ఏమి?" అన్నారు. వేరొక భక్తుడితో, "నీకు అప్పా అను కన్నడ సాధువు చెప్పినది యదార్థమే, కానీ అతడు చెప్పిన గ్రంథాన్ని చదివితే మాత్రమే చాలదు. దానిని అర్థం చేసుకొని ఆచరించాలి. ఆధ్యాత్మిక జీవితంలో మన శక్తినంతా వినియోగించి కృషి చేస్తేగాని ఫలితం ఉండదు" అన్నారు. అంటే ముముక్షువులకు సాధన ఎలా చేయాలో తెలుసుకొని దానిని అనుసరించమని బోధించారు- అన్నది స్పష్టం. ఎక్కువ మంది భక్తులు ఈ సత్యాన్ని గుర్తించక ముందు చెప్పిన రీతిన భ్రాంత చిత్తులవుతున్నారని తెలపడానికి ఒకసారి తమ వద్దకన్నీ నొక్కుబోయినవి, అరిగిపోయిన నాణాలే చేరుతున్నాయని, తమకు శిష్యుడని చెప్పుకోతగ్గవాడొక్కడు కూడా కనిపించలేదని చెప్పారు. "నా వద్దకు అందరూ గొంతెమ్మ కోరికలతో వస్తున్నారు. కానీ నావద్ద కోకొల్లలుగా జ్ఞానధనమున్నా, నేను యివ్వదలచిన దానిని తీసుకునేవాడొక్కడూ కనిపించలేదు" అని 1886లో వారు 72 గంటలు సమాధి స్థితిలో ఉండబోయే ముందు మహల్సాపతితో వాపోయారు.

నిజానికి సాయి సాధన గూర్చి బోధించనదంటూ ఏమీ లేదని 'శ్రీ సాయి ప్రబోధామృతం' చూస్తే తెలియగలదు. అయితే సాయి బోధనామార్గం అద్భుతం. ఆయన ప్రబోధామృతాన్ని పారాయణ, మననము చేస్తే, మన జీవితమంతా సాధనగా మారగలంతటి అద్భుతమైనది. అది తెలియక "సాయి మనలో వుండి, మనమే తామై, సాధన చేసుకుపోతారు. అదే వారి ప్రత్యేకత" అని మధురమైన ఆత్మవంచనలో కొందరు మునుగుతున్నారు. అదే నిజమైతే ఈనాడు మానవజాతి ఇంత క్షీణదశలో ఉండవలసిన అవసరం లేదు. అట్టి కార్యం భగవంతుడికి వారి ప్రతిరూపమైన సద్గురువులకు సమ్మతం కాదు. తండ్రి తన కుమారుడు ప్రయోజకుడై తన స్వశక్తిపై ఆధారపడి మనగల స్వతంత్రుడు కావాలని కోరుతాడు. నిష్క్రియుడై అంతా తండ్రి చేయాలని తలచకూడదు అని కోరుతాడు. సర్వులకు తండ్రి అయిన బాబా కూడా అలానే కోరుతారని అని మనం గుర్తించాలి. మన కర్తవ్యం అయిన సాధనాతత్వాన్ని గుర్తించి, ఆచరించి, వారి నిరంతర అనుగ్రహస్రవంతికి పాత్రులం కావాలని వారి ఆకాంక్ష. "తల్లికి తగ్గ బిడ్డలు కండి. మీ (జ్ఞాన) ధనాగారాలను నింపుకోండి" అన్నది వారి సూక్తి. సాయికి ప్రీతిపాత్రులు అవ్వడానికి అదొక్కటే మార్గం. అలా చేయని భక్తులను గూర్చి వారిలోని అజ్ఞాన ప్రవృత్తిని గూర్చి ఆయన భావగర్భితంగా ఇలా అనేవారు. "నన్ను నూనె వర్తకులు (తేలి) దుకాణదారులు (వణీ) ఎంతగానో వేధించారు. నాకు ఈ మసీదులో ఉండడమంటే విసుగు పుట్టింది. నేను ఇక్కడనుంచి వెళ్ళి చిలుము త్రాగుతూ హాయిగా ఒక మూల కూర్చుంటాను" అని. ●

# అమ్మా! శరణు శరణు!

**శ్రీమతి ఆడిదం వేదవతి**

**అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! జగజ్జననీ! గురుపత్నీ! సద్గురు స్వరూపిణీ! శరణు శరణు!!**

**అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! జగజ్జననీ! గురుపత్నీ! సద్గురు శ్రీ భరద్వాజ గురుదేవుల ప్రతిరూపమా!** మీకు సహస్ర కోటి వందనాలు.

మీ పవిత్ర జన్మదినోత్సవం సందర్భంగా మేమందరమూ మీ పవిత్ర సన్నిధానం చేరి, మీ పాదాల చెంత నిలిచి మీ కృపకై, మార్గదర్శకానికై ప్రార్థిస్తున్నాము.

ఈ దేవీ నవరాత్రుల సందర్భంగా మీరే మా పాలిటి నవదుర్గలై మమ్ములను మహాత్ములు నడిచి చూపిన సన్మార్గంలో నడిపించండి! ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రసాదించండి! మహిషాసురమర్దిని స్వరూపులైన మీరు సర్వసమర్థులు. మమ్ములను అనుగ్రహించండి.

**అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! మీరే మా పాలిటి శైలపుత్రి!** మా ఈ ఆధ్యాత్మిక ప్రయాణానికి నాందీ మీరే! పునాది మీరే! అత్యంత బలోపేతమైన, శక్తివంతమైన హిమాలయాలకే సుపుత్రిక అయిన మీరు మాలో ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మొదలుపెట్టేందుకు, కొనసాగించేందుకు, లక్ష్యాన్ని చేరేందుకు అవసరమైన దృఢత్వాన్ని, మానసిక శారీరిక బలాన్ని ప్రసాదించండి.

**అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! నవదుర్గలలో బ్రహ్మచారిణి మీరే!** మాలో జరిగే సత్యాన్వేషణకు మార్గదర్శి మీరే! ఈ ఆధ్యాత్మిక మార్గశోధనకు అవసరమైన జ్ఞానాన్వేషణను, సత్యాన్వేషణను మాలో ప్రేరేపించి మమ్ములను ముందుకు నడిపించండి. మీ పవిత్ర సన్నిధానంలో మాకు అనుభవమయ్యే అనంతమైన మీ మౌనబోధ అన్ని దిక్కుల నుండి ఎల్లప్పుడూ మాపై వర్షిస్తూనే వుంటుంది. ఆ బోధను గ్రహించి మీ ఇరువురి చరిత్రను, ఇతర మహాత్ముల



చరిత్రలను, సాయి తత్వాన్ని, బోధలను అవగాహన చేసుకుని, ఈ సృష్టి తత్వాన్ని, పరమాత్మ తత్వాన్ని, దత్త సాంప్రదాయాన్ని మరింత లోతుగా శోధించి సరైన స్పష్టతతో, దీక్షతో మేము ఆధ్యాత్మికంగా పురోగమించేలా అనుగ్రహించండి.

**అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! మా పాలిటి చంద్రఘంటా!** మాలోని శౌర్యం, ధైర్యం మీరే! మా హృదయలోతుల్లో పాదుకునివున్న బలహీనతలను, కుసంస్కారాలను, సంఘర్షణలను ధైర్యంగా



ప్రతిఘటించి, యుద్ధం చేసి, జయించేలా అనుగ్రహించండి. మా ఆధ్యాత్మిక ప్రయాణంలో ఆద్యంతం ఎదురయ్యే అవరోధాలను అధిగమించి, తగిన క్రమశిక్షణతో, స్ఫూర్తితో, దృఢసంకల్పంతో ముందుకు సాగేలా ఆశీర్వదించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! సాక్షాత్తు కుష్మాండా దేవి మీరే!*** మాలో దాగివున్న సృజనాత్మకశక్తిగా నిలచి మాలో వుండే అనేకానేక సామర్థ్యాలనన్నింటినీ ఆధ్యాత్మిక పురోభివృద్ధికి, సకలజీవుల శ్రేయస్సుకు ఉపయోగపడేలా సంస్కరించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! మా స్కందమాతా!*** మాకు ఈ జన్మనిచ్చి ఎల్లప్పుడూ పాలించి, పోషించే జగన్మాత మీరే! మీ వాత్సల్యపూరితమైన పరిరక్షణ వలననే మేము ఆధ్యాత్మిక ప్రయాణాన్ని పరిపుష్టం చేసుకుని, సకల జీవుల పట్ల ప్రేమను, సహకారాన్ని, సామరస్యాన్నీ సాధించగలము. అట్టి సామర్థ్యాన్ని మాకు ప్రసాదించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! మా పాలిటి కాత్యాయనీ!*** జీవులనన్నింటినీ ఎప్పుడూ కరుణించి, రక్షించేది మీరే! మీ రక్షణ వలననే మాలోని భయము, సంశయము సమ్మూలంగా నశించిపోతాయి. వాత్సల్యపూరితమైన మీ అండదండలతో మా అంతరంగాలలో భద్రత, నిర్భయత్వము, అవరోధాలను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! గురుస్వరూపిణీ! కాళరాత్రీ!*** మాలో అజ్ఞానాంధకారాన్ని నశింపజేసే శక్తి మీరే! మాలోని మూర్ఖత్వాన్ని, అస్పష్టతను, అలజడిని పారద్రోలి, మమ్ములను స్పష్టత వైపుకు నడిపించి, సాధనా సూక్ష్మాలన్నీ అవగతమయ్యేలా అనుగ్రహించి, ఆధ్యాత్మిక మార్గాన్ని సుగమం చేయండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! గురుపత్నీ! మహాగౌరీ!*** మాలోని కళంకాలనన్నింటినీ ప్రక్షాళన చేసి స్వచ్ఛతను, పవిత్రతను అనుగ్రహించే శక్తి మీరే! మాలోని మాలిన్యాలను, దుష్ట సంస్కారాలను కడిగివేసి, నిరంతరం వర్షించే మీ కృపను, ఆశీస్సులను గుర్తించి పులకించేలా ఆశీర్వదించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! మా పాలిటి సిద్ధిదాత్రీ!*** మా ఆధ్యాత్మిక సాధన సిద్ధించేలా చేసే శక్తి మీరే! కనుక మీరే మాకు ఆధ్యాత్మిక సూక్ష్మాలను ఎరుకపరిచి, ఆధ్యాత్మిక శక్తిని, అనుభవాలనూ ప్రసాదించి, మమ్ములను జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది, ఆత్మసిద్ధి పొంది పరమాత్మలో లీనమయ్యేలా అనుగ్రహించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! జగజ్జననీ! మా మహిషాసురమర్దినీ!*** మా లోపల, బయటా వున్న అజ్ఞానాంధకారాన్ని తునాతునకలు చేసే మహాశక్తి స్వరూపిణి మీరే! మీ అపార అనంత శక్తితో మాలోని మూర్ఖత్వాన్ని, దురహంకారాన్ని సమ్మూలంగా నశింపచేయండి. మీ పవిత్ర మౌనమే సింహగర్జన చేసి, మాలో నిద్రాణంగా వున్న ఆధ్యాత్మిక శక్తిసామర్థ్యాలను తట్టి లేపి వాటిని నిరంతరం గుర్తుచేస్తుండేలా ఆశీర్వదించండి.

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! జగజ్జననీ! సద్గురు స్వరూపిణీ!*** మీరే మా ఆధ్యాత్మిక మార్గదర్శి! మమ్ములను అడుగడుగునా రక్షిస్తూ, నడిపిస్తూ వున్న మీ అండదండలకు కృతజ్ఞతాభివందనాలు. మీ వెలుగుబాటలో పయనిస్తున్న ఆర్తులము, అర్థార్థులమైన మేము జిజ్ఞాసులమై, ముముక్షువులమై మీరు ప్రసాదించదలచిన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని స్వీకరించగలిగే అర్హతను పొందుదుముగాక! ఈ ఆధ్యాత్మిక మార్గంలో జన్మజన్మలకూ అడుగడుగునా మమ్ములను చేయిపట్టి నడిపించి ఉద్ధరించండి! మేము ఎల్లప్పుడూ మీ అపారకరణకు పాత్రులమగుదుముగాక!

***అమ్మా! అలివేలుమంగమ్మ తల్లీ! శరణు శరణు!!***

# ద్వారకామాయి అనుభవమండపము

***శ్రీమతి హైమవతి, అనంతపురం***

మాది అనంతపురం దగ్గర నారసింహపల్లె గ్రామం. నేను పదవ తరగతి చదువుతున్నప్పుడు తరచుగా బాబా గుడికి వెళ్ళదాన్ని. అలా వెళ్ళినప్పుడు ఒకసారి ఆ గుడిలో శ్రీ సాయి లీలామృతం గ్రంథం కొనుక్కున్నాను. మా ఇంట్లో మా తమ్ముడు తప్పించి మిగతా అందరం ఆ గ్రంథాన్ని పారాయణ చేసుకునేవాళ్ళం. తర్వాత నెమ్మదిగా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలన్నీ కొనుక్కున్నాము. అందులో 'సత్సంగం-భజన' అనే గ్రంథంలో చెప్పినట్లు, సత్సంగం, భజన కూడా చేసుకునేవాళ్ళం. ఆ సత్సంగానికి చాలామంది హాజరయ్యేవారు. మా కుటుంబ సభ్యులతో సహా అందరికీ చక్కటి అనుభవాలు కలుగుతుండేవి. ముందుగా మా అమ్మకి కలిగిన అనుభవం చెప్తాను. మా అమ్మకి కేటరాక్ట్ ఆపరేషన్ చేయవలసిన అవసరం వచ్చింది. కళ్ళు సరిగ్గా కనిపించేవికాదు. కానీ పారాయణ చేసుకోవడం చాలా ఇష్టం. అలాగే ప్రతిరోజు పారాయణ చేసేది. సరిగ్గా కళ్ళు కనిపించనప్పుడు పారాయణ చేయడం ఎలా సాధ్యమనేది నాకు అర్థం అయ్యేది కాదు. అప్పుడు మా అమ్మ యిలా చెప్పారు: "గ్రంథం తెరవగానే, నేను ఏ పేజీ చదువుతానో ఆ పేజీలో అక్షరాలు చాలా పెద్దవిగా అయిపోయేవి. అలా ఆ పేజీ చదవటం పూర్తయ్యాక వెనక్కి చూస్తే మళ్ళీ అక్షరాలు మామూలుగానే వుండేవి. నేను చదవాల్సిన పేజీలో అక్షరాలు మాత్రం పెద్దవిగా కనిపించేవి. అందువల్ల నేను చదవగలుగుతున్నాను". ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. అమ్మకి కేటరాక్ట్ ఆపరేషన్ అయినా కానీ, కొన్ని సమస్యల వల్ల కళ్ళు సరిగ్గా కనిపించవు. కానీ పారాయణం మాత్రం చక్కగా చేసుకోగలుగుతోంది బాబా దయవల్ల!!

నేను చదువుకునే సమయంలో ద్వితీయ శ్రేణికి చెందిన విద్యార్థిని. సాధారణంగా ఎప్పుడు 50% మార్కులే వచ్చేవి. ఒకసారి కళాశాలలో పరీక్షలు రాసేటప్పుడు ఫిజిక్స్ పరీక్షకి సిద్ధమవుతున్నప్పుడు ఒక ప్రశ్నని, అది పరీక్షలో రాదులే అనిపించి చదవలేదు. కానీ మర్నాడు పరీక్షలో ఆ ప్రశ్నే వచ్చింది. నేను ఒకసారి సమాధానం చూసి వదిలేసాను. కానీ గట్టిగా చదవలేదు. ఆ ప్రశ్నకి సమాధానం రాయకపోతే నాకు సరిపడే మార్కులు వచ్చే అవకాశం లేదు. ఇలా ఆలోచిస్తూ ఉండగా నేను ఆ ప్రశ్నకి సమాధానం రాయడం మొదలుపెట్టాను. ఆశ్చర్యంగా నాకు మొత్తం సమాధానం అంతా వినిపిస్తున్నట్లు అనిపించి రాసేశాను. ఇంటికి వచ్చి చూసుకుంటే మొత్తం సమాధానం అంతా సరిగ్గా ఉంది. ఇది చాలా ఆశ్చర్యకరమైన సంఘటన. నేను ఊహించినదానికంటే మంచి మార్కులతో ఉత్తీర్ణురాలిని అయ్యాను.

మా ఇంట్లో వాళ్ళందరం శ్రద్ధగా పారాయణ భజన చేసుకుంటూ ఉంటే మా పెద్ద తమ్ముడు మాత్రం చాలా వేళాకోళంగా నవ్వేవాడు. ఎప్పుడు ఆ సత్సంగల్లో పాల్గొనేవాడు కాదు. ఒకసారి వాడు ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు పరీక్షలకి ముందు రోజు వాడికి బాగా జ్వరం వచ్చింది. వాడికి నచ్చదు అని తెలిసినా నేను బాబా ఊదీ పెట్టాను. తర్వాత కాసేపటికి వాడికి బాగా నిద్ర వచ్చి జ్వరం తగ్గింది. మర్నాడు పరీక్షలు బాగానే రాసాడు. ఇక అప్పటినుంచి వాడికి బాబా మీద బాగా నమ్మకం కుదిరింది. ఇప్పుడు మా అందరి కంటే ఎక్కువగా బాబాని సేవించుకుంటాడు. జీవితంలో

కూడా చక్కగా స్థిరపడ్డాడు ఇలా శ్రీ సాయినాథుడు మా కుటుంబంలో వాళ్ళందరికీ ఎన్నో అనుభవాలు ప్రసాదించారు.

అలాగే మా ఇంటి పక్కన ఒక ఆంటీ ఉండేవారు. ఆవిడ దేవుడిని నమ్మేవారు కాదు కానీ వ్యక్తిగతంగా చాలా మంచివారు. మేము బాబా లీలలు చెప్పుకుంటూ వుంటే వింటుండేవారు. అలా కొన్నాళ్ళు పోయాక ప్రత్యేకించి నన్ను బాబా లీలలు చెప్పమని అడుగుతుండేవారు. నేను చెప్తుంటే చాలా శ్రద్ధగా వినేవారు. కొన్నాళ్ళకి మొట్టమొదటిసారిగా మా కుటుంబం అంతా శిరిడీ వెళ్ళాం. అది 2001వ సంవత్సరం.. నేను మా సత్సంగం వాళ్ళందర్నీ బాబాకి ఏం చెప్పమంటారు అని అడిగాను. వాళ్ళందరూ తలా ఒకటి చెప్పారు, నేను ఆంటీ ని కూడా అడిగాను. అప్పుడు ఆంటీ, "నాకు ఏం కావాలో బాబాకు తెలుసులే" అన్నారు. ఆంటీ కి పెళ్లి అయ్యి 13 సంవత్సరాలు అయింది. కానీ ఇంకా పిల్లలు కలగలేదు. బహుశా అదే అయి వుంటుంది అని అనుకుని నేను శిరిడీకి వెళ్ళాక బాబాతో, ఆంటీకి పిల్లల్ని యివ్వమని కోరుకున్నాను. నేను శిరిడి నుంచి తిరిగి వచ్చిన నెలలోనే ఆంటీ గర్భవతి అయ్యారు. తర్వాత ఆంటీ కి బాబు పుట్టాడు. ఆంటీకి బాబా మీద చాలా విశ్వాసం కలిగింది. బాబా దయ వల్లే తనకు బాబు పుట్టాడని వాడికి 'సాయి' అని పేరు పెట్టుకున్నారు. వాడిని ఆరు నెలల వయసు నుంచి సత్సంగానికి తీసుకొచ్చేవారు. వాడు బాబా హారతి పెడితే చాలా శ్రద్ధగా వినేవాడు ఇదంతా చూసిన మా అందరికీ ఇది బాబా అనుగ్రహమని కచ్చితంగా అనిపించేది.

ఇలాంటి అనుగ్రహాలతో పాటు మేము చేసిన తప్పులను కూడా సవరించేవారు బాబా! నేను ప్రతి సత్సంగంలోనూ సాయి లీలామృతము లోని లీలలను చదవడమే కాక వివరించి చెప్పేదాన్ని. అది అందరికీ బాగా నచ్చేది. చాలామంది పారాయణ వినడానికి ఆసక్తి చూపించేవారు. సత్సంగం జరిగే గదంతా భక్తులతో కిక్కిరిసిపోయి వుండేది. ఒకరోజు నాకు 'ఇలా నేను బాగా వివరించి చెప్పడం వల్ల ఇంతమంది వస్తున్నారు కదా!' అని అనిపించింది. మరుసటి గురువారం సత్సంగానికి ఒక్కరు కూడా రాలేదు. మేము సాయంత్రం 6గంటల నుంచి 8 గంటల వరకు సత్సంగం చేసేవాళ్ళం. 6:00కి నేను మొదలు పెట్టాక 8గంటలైనా ఒక్కరు కూడా రాలేదు. నాకు అప్పుడు ముందు రోజు వచ్చిన నా భావన గుర్తుకు వచ్చింది. వెంటనే బాబాకి క్షమాపణలు చెప్పుకొని నమస్కరించుకున్నాను. వెంటనే ముందు ఒక పాప వచ్చింది. తర్వాత మొత్తం సత్సంగ సభ్యులందరూ వచ్చారు. ఆలస్యానికి రకరకాల కారణాలు చెప్పారు. కానీ నా భావం సరిచేయడానికి బాబా అందరికీ ఆ సమయంలో రకరకాల పరిస్థితులు కల్పించారని నాకు అనిపించింది. నా మీద దయతో ఆ రోజు బాబా నన్ను సరిచేయకపోతే నా పరిస్థితి ఎలా వుండేదో అనిపిస్తుంది. ఇప్పటికి ఎప్పటికీ, వారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు తెలియజేసుకుంటూనే వుంటాను.

ఇలా మా కుటుంబంలో వాళ్ళకి మా సత్సంగం వాళ్లకి బాబా ఎన్నో అనుభవాలు జరుగుతూ వుండేవి. మేము మొదట నరసింహ పల్లెలో వుండేవాళ్ళం. తర్వాత మా నాన్నగారు పక్కనే ఉన్న అనంతపురానికి నివాసం మార్చారు. పల్లెలో వున్నంతకాలం చాలా బాగా వుండేది. అక్కడికి వెళ్లాక కొన్ని పరిస్థితుల వల్ల సంపాదనంతా పోగొట్టుకొని తిరిగి పల్లెకి వచ్చాం. ఆ సమయంలోనే మా కుటుంబానికి బాబాతో పరిచయం ఏర్పడింది. శ్రీ సాయిలీలామృతం గ్రంథం మా చేతిలోకి రాగానే మా జీవితాలు మారిపోయాయి. మా తమ్ముళ్ళు ఇద్దరూ జీవితాల్లో చక్కగా స్థిరపడ్డారు. నాకు వివాహమై నేను హైదరాబాద్ వచ్చేసాను. మావారు ఇంగ్లీష్ ప్రొఫెసర్ గా పనిచేస్తారు. నేను హైదరాబాదులో మ్యాథ్స్ లెక్చరర్ గా పని చేసేదాన్ని. ఇప్పుడు సొంతంగా అకాడమీ పెట్టుకున్నాను. మేమిద్దరం మూడు సంవత్సరములు విదేశాల్లో కూడా ఉద్యోగ విధులు నిర్వహించాము. ఇదంతా ఖచ్చితంగా బాబా దయ. మా నాన్నగారు నరసింహపల్లెలోనే పెద్ద ఇల్లు కట్టుకున్నారు. అమ్మ, నాన్న ఆ ఇంట్లో చక్కగా పారాయణలు, సత్సంగాలు, బాబా హారతులు చేసుకుంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.

ఒక్క సాయి లీలామృతము గ్రంథం మా అందరి జీవితాలని మార్చేసింది. మాకు పూజ్యశ్రీ మాస్టరుగారు అంటే దైవంతో సమానం. బాబాకి, మాస్టరుగారికి మా ఉద్దేశంలో తేడానే లేదు. మా అందరికీ ఇంత చక్కటి జీవితాన్ని ప్రసాదించిన సాయి మాస్టర్ల కి సర్వదా కృతజ్ఞులం!! ●

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి భాగ్య, అనంతపురం

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని అనంతపురం వాస్తవ్యులు శ్రీమతి భాగ్యగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు..

మా ఇంట్లో మహాత్ములను ఆరాధించడం తెలియదు. కానీ చిత్రంగా నాకు పూజ్యశ్రీ మాస్టరుగారంటే చాలా ఇష్టం ఏర్పడింది. మా ఊర్లో బాబా గుడి వుంది. నాకు నిత్యం బాబా గుడికి వెళ్లే అలవాటుండేది. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు చూస్తూండేదానిని. శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర పారాయణ చేసేదాన్ని. ఆయన మంచి రచయిత అనుకునేదానిని కానీ అంతకుమించిన భావన ఏమీ వుండేది కాదు. మా ఊర్లో బాబా గుడిలో 'శ్రీరామ' అని వ్రాయమని కొన్ని పుస్తకాలిచ్చి, అవి వ్రాస్తే 100 రూపాయలిచ్చేవారు. నేను డబ్బులొద్దని, దాని బదులు పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలిమ్మని అడిగాను. అలా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు నా దగ్గరకు వచ్చాయి.

తరవాత 2009లో నాకు పెళ్లయ్యింది. పెళ్లయ్యాక హైదరాబాదుకు వచ్చేశాను. అప్పుడు నేను గుళ్లో కొనుక్కున్న పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు చదవడం మొదలుపెట్టాను. 'మహాత్ముల ముద్దుబిడ్డడు' గ్రంథంలో పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందే ఘట్టం వచ్చేసరికి విపరీతమైన బాధ, దానికంటే ఎక్కువగా కోపం వచ్చేశాయి. ఎందుకంటే ఈయన మహాత్ములంటున్నారు--- చిన్న పిల్లల్ని, ఆరోగ్యం బాగోలేని పూజ్యశ్రీ అమ్మగారిని అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోవడమేమిటని?! తరవాత ఆనందమాయి జీవితచరిత్ర చదివాను. అందులో పూజ్యశ్రీ మాస్టరుగారు అమ్మ దర్శనం కోసం రాత్రంతా చలిలో గడపటం గురించి చదివి విపరీతంగా బాధపడ్డాను. ఆ మరునాడే వేరే గ్రంథంలో వెంకయ్య స్వామిని ఎవరో హింసించినట్లు చదివి, "మహాత్ములు ఇందుకే వస్తారా?! మనకోసం ఇంత బాధపడతారా?!" అని చాలాసేపు ఏడ్చాను. పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు చదువుతుంటే, మనందరికోసం ఆయన పడిన శ్రమ తలచుకుంటే, నాకు కన్నీళ్లు ఆగేవికావు. అప్పుడు నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. "మాస్టరుగారూ! మీరు మా కోసం ఇంత కష్టపడ్డారు కదా? దానికి కృతజ్ఞతగా నేను జీవితాంతం శ్రీ గురుచరిత్ర, శ్రీసాయిలీలామృతం ఏ కోరికా లేకుండా సప్తాహాలు చేస్తాను" అని మొక్కుకున్నాను.

తరవాత నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేను ఊర్లో అందరికీ మన వూరికి భరద్వాజగారొచ్చారని, దర్శనానికి రమ్మనీ చెప్తున్నాను. ఒకరి ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారున్నారు. నన్ను లోపలకు రమ్మని పాద నమస్కారం చేసుకోమన్నారు. నేను నమస్కరించుకున్నాను.

తరువాత 'భగవాన్ శ్రీ భరద్వాజ' గ్రంథం చదివినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని వారి అన్నయ్యలు ఎత్తుకుని తిప్పి ఆడించేవారని చదివి, నా మాస్టరుగారిని అంత బాగా చూసుకున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు చెప్పాలనిపించింది. అదేరోజు రాత్రి అన్నదమ్ములు నలుగురూ వరసగా నిల్చుని కలలో కనిపించారు. నేను ఆశ్చర్యపోయి చూస్తూ, ఇందులో నా మాస్టరుగారు ఎక్కడున్నారని ఆదుర్దాగా వెతుకుతున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు, 'నేనిక్కడున్నాను!'

అన్నట్లు కనుబొమ్మలెగరేస్తూ నవ్వుతున్నారు. ఎంతో సంతోషం కలిగింది.

నాకు బయటికి వెళ్లే అవకాశం తక్కువ. అందువల్ల గురుకుటుంబాన్ని చూసే అవకాశమే రాలేదు. ఒకసారి హైదరాబాదులో బాబా గుడికి వెళితే అక్కడ రాజయ్యగారు అనే ఆయన పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు స్టాల్ పెట్టారు. ఆరోజు వారితో మాట్లాడినప్పుడు, వాళ్ళింట్లో వేదమ్మగారు వచ్చి సత్సంగం చేస్తారని రమ్మని ఆహ్వానించారు. అప్పుడు మాత్రం వీలు కుదుర్చుకుని సత్సంగానికి వెళ్ళాను. వేదమ్మగారితో మాట్లాడదామని వెళ్లి ఏడ్చేశాను. "పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడలేకపోయానని బాధగా వుంది" అని చెప్పాను. అప్పుడు వేదమ్మగారు, "అలా బాధపడకూడదు. పారాయణలు చేసుకుంటూ, వారాశించిన మార్గంలో నడవాలి" అని చెప్పారు. తరువాత మావారికి కరోనా వచ్చినప్పుడు స్వప్నంలో ద్వారకబాబుగారు, వేదమ్మగారూ వచ్చి మా ఇంట్లో సత్సంగం, భజన చేసి హారతిచ్చారు. ఇంటి దగ్గరే వుండి వైద్యం చేసుకుంటే కొన్నిరోజులలో తగ్గిపోయింది. అలా పరోక్షంగా కూడా మమ్మల్ని ఆదుకున్నారు.

శ్రీ సా యి లీ లా మృ త ం , శ్రీగురుచరిత్ర సప్తాహ పారాయణలు 108 సార్లు పూర్తిచేయగలిగాను. నాకు శ్రీగురుచరిత్రలో ఏ అధ్యాయంలో ఏముందో బాగా గుర్తుంటుంది. అయితే ఒకసారి అకస్మాత్తుగా ఆ గ్రంథంలో ఏముందో ఒక్క ముక్క కూడా గుర్తులేకుండాపోయింది. నాకు చాలా బాధకలిగింది. బహుశా గర్వం వచ్చిందేమోననిపించి, పూజ్యశ్రీ మాస్టరుగారిని నాకు శిక్ష వేయమని ప్రార్థించాను. ఆరోజు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "నా అనుగ్రహం వుంటేనే పారాయణ చేయగలవు!" అని చెప్పారు. అప్పటినుంచి చాలా జాగ్రత్తగా వుంటున్నాను.

నాకు జ్ఞానదంతం వచ్చి చాలా ఇబ్బంది పెట్టింది. డాక్టర్ దగ్గరకి వెళితే ఆపరేషన్ చేసి పన్ను తీసెయ్యాలన్నారు. ఆపరేషనుకి చాలా సమయం పట్టింది. దానివల్ల నోరంతా వాచిపోయింది. డాక్టర్ ఒకవారం ద్రవాహారమే తీసుకోవాలన్నారు. కానీ నాలుగోరోజుకి నాకు అన్నం తినాలనిపించి తిన్నాను. నోరంతా కదలడం వల్ల మళ్లీ బాగా వాచిపోయి, నొప్పి బాగా ఎక్కువైంది. పూజ్యశ్రీ మాస్టరుగారి నామం చెప్పుకుంటూ పడుకున్నాను. ఆరోజు రాత్రి స్వప్నంలో ఎవరో, "అమ్మగారు, మాస్టరుగారు వచ్చారు, దర్శనానికి రండి" అని పిలుస్తున్నారు. నేను వెంటనే దర్శనానికి వెళ్లాను. నేనేమీ చెప్పకుండానే పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను దగ్గరకు రమ్మని సైగ చేసి, నోరు తెరవమని చెప్పి, ఊదీ తీసుకుని పన్ను పీకిన చోట పెట్టారు. నేను నమస్కారం చేసుకుని ఇంటికి రాగానే, కొంతసేపటికి నొప్పి తగ్గింది. నాకు చాలా సంతోషంగా అనిపించి ఆ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పాలని, మళ్ళీ వెళ్లాను. అక్కడ వున్నవారు పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పారు. నాకు దూరంనుంచి వారు కనిపిస్తున్నారు. నేను మనసులోనే నమస్కారం చేసుకుంటున్నాను. ఈలోపు పడుకుని వున్న పూజ్యశ్రీ మాస్టరుగారు తలెత్తి నావైపు చూశారు. స్వప్నం ముగిసింది. మర్నాటినుంచి నిజంగానే నాకు నొప్పి తగ్గిపోయింది.

పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన మహాత్ముల గ్రంథాలు చదువుతుంటే, ఎవరి గ్రంథం చదువుతుంటే వారు స్వప్నదర్శనమిచ్చారు. అవధూత చివటం అమ్మ చరిత్ర పారాయణ చేసినప్పుడు అమ్మ నాతో, "నేనే మీ అమ్మను!" అని చెప్పారు. అలాగే పాకలపాటి గురువుగారి చరిత్ర చదివినప్పుడు ఆయన స్వప్న దర్శనమిస్తే, "బాబుగారూ, నేను భరద్వాజ మాస్టరుగారి శ్రీగురుచరిత్ర పారాయణ చేస్తాను. నాకు ఈ సాధన సరిపోతుందా?" అని అడిగాను. దానికి ఆయన, "పారాయణతో పాటు జ్ఞానంకూడా సంపాదించాలి" అన్నారు. నాకు మిలారేపా గారి జీవిత చరిత్ర అంటే చాలా ఇష్టం. నేను సాధన సరిగ్గా చేయటం లేదనిపించినప్పుడు వారి చరిత్ర చదువుకుంటాను. ఇలా పూజ్యశ్రీ మాస్టరుగారు వారి అనుగ్రహంతో పాటు అందరి మహాత్ముల అనుగ్రహాన్ని నాకు ప్రసాదిస్తున్నారు. ముఖ్యంగా చక్కటి జీవితవిధానం దొరికింది. ఎంత కష్టపడి అయినా సరే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే నడుచుకోవాలని నా ఉద్దేశ్యం, లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి వారి అనుగ్రహ ఆశీస్సులు ప్రసాదించమని హృదయపూర్వక నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను.

ఓం భవరోగనివారిణే శ్రీ భరద్వాజ సద్గురవే నమః! ●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ  స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూడ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

# శ్రీ అలివేలు మంగమ్మ తల్లి జన్మదినోత్సవ కార్యక్రమముల వివరములు

## 01-10-2023 ఆదివారము

### ఉదయ కార్యక్రమములు:

గం॥ 05:30 - మేలుకొలుపు
గం॥ 06:00 - కాకడ ఆరతి
గం॥ 07:00 - గంధపు జలము, తులసి మారేడు పత్రములతో కూడిన జలము, పవిత్ర గంగాజలములతో మాతృదేవి సమాధికి ప్రత్యేక అభిషేకము తదనంతరము ప్రత్యేక అలంకరణ, అల్పాహార నివేదన
గం॥ 09:30 - అల్పాహార ప్రసాద వితరణ
గం॥ 10:00 - మాతృదేవి కి విశేష పూజ
గం॥ 11:00 - గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతి గారిచే సత్సంగము
గం॥ 11:30 - గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారిచే సత్సంగము
గం॥ 12:00 - మధ్యాహ్న హారతి
గం॥ 12:30 - మధ్యాహ్న భోజన నివేదన
గం॥ 13:15 - నుండి మధ్యాహ్న భోజన ప్రసాద వితరణ

### సాయంకాల కార్యక్రమములు:

గం॥ 16:00 - 'ఆధ్యాత్మిక జాగృతి' గ్రంథము - సామూహిక పారాయణ
గం॥ 18:00 - సాయంకాల ఆరతి
గం॥ 19:00 - అవధాని శ్రీ మానేపల్లి నాగకుమార శర్మ గారిచే అష్టావధానం
గం॥ 21:00 - శేజ్ ఆరతి
గం॥ 21:30 - నైవేద్యం, తదనంతరము ప్రసాద వినియోగం
గం॥ 21:45 - పవళింపు సేవ

## 02-10-2023 సోమవారము

### ఉదయ కార్యక్రమములు:

గం॥ 05:30 - మేలుకొలుపు
గం॥ 06:00 - కాకడ ఆరతి
గం॥ 07:00 - మాతృదేవి సమాధికి అభిషేకము తదనంతరము అలంకరణ, అల్పాహార నివేదన
గం॥ 09:30 - అల్పాహార ప్రసాద వితరణ
గం॥ 10:30 - గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ మరియు గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతి, శ్రీ అడిదం శ్రీకాంత్ గార్లతో సద్గోష్ఠి
గం॥ 12:00 - మధ్యాహ్న హారతి
గం॥ 12:30 - మధ్యాహ్న భోజన నివేదన
గం॥ 13:30 - నుండి మధ్యాహ్న భోజన ప్రసాద వితరణ, కార్యక్రమము ముగింపు.

**శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము**

గుమ్మళంపాడు, సంత నూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా (ఆం.ప్ర)

( వివరములు కోరకు: శ్రీ శశిధర్ : 9849645573, శ్రీ రమేష్ : 9440018038 )

**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.**
**Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust, Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.**




## శ్రీ శిరిడీ సాయినాథ్ మహారాజ్ మహాసమాధి పర్వదినము

**విజయదశమి (24-10-2023)**

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.